ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 105 గురువారం 02 - 04 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 105 Thursday 02 - 04 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


5 లో

# ఆటోలో కల్తీ నూనె తరలింపు

**హోటళ్ల నుంచి వాడిన నూనె సేకరణ - 30 డబ్బాలతో అక్రమ రవాణా**
**జర్నలిస్టుల అప్రమత్తతతో బయటపడిన దందా --**
**ఫుడ్ సెక్యూరిటీ, జిహెచ్ఎంసి అధికారుల కోసం పోలీసుల ఎదురుచూపులు**



**ఉప్పల్, ఏప్రిల్ 01; (వార్త సంధ్య):** హైదరాబాద్ నగరంలో కల్తీ వంటనూనె దందా మరింత విస్తరిస్తోందనే అనుమానాలను బలపరిచే ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా హోటళ్లలో వాడిన నూనెను తిరిగి మార్కెట్‌లోకి పంపించే అక్రమ వ్యవహారం జరగడం ఆందోళన కలిగిస్తోంది. **వివరాల్లోకి వెళితే...**
నగరంలోని పలు హోటళ్లలో వాడి పారేసిన వంట నూనెను సేకరించి మళ్లీ విక్రయించేందుకు కొందరు దందా దారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో 15 లీటర్ల సామర్థ్యం గల సుమారు 30 డబ్బాల్లో ..- మిగతా 5 లో

## అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం తప్పుగా మాట్లాడారు



- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పాడి కౌశిక్ రెడ్డి
- సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారన్న కౌశిక్ రెడ్డి
- కడియం శ్రీహరి ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో చెప్పాలని నిలదీత
- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్

**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 01 :**
అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్ - మిగతా 2 లో

2 లో

## మీ సేవ కేంద్రాల్లో ఛార్జీల పెంపు

- పెంచిన ఛార్జీలు అమలు
- ఆయా సర్వీసులపై 50 శాతం మేర పెరిగిన ధరలు
- 'ఏ' కేటగిరీ కింద వచ్చే సేవలపై ఛార్జీలు రూ.62కు పెంపు
- 'బీ' కేటగిరీ కింద వచ్చే సేవలపై ఛార్జీలు రూ.80కు పెంపు


2 లో

## ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో
- యూరప్‌ను తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందన్న రూబియో
- అణుబాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలో ఉందని వెల్లడి
- ఇరాన్‌పై సైనిక చర్య విజయవంతంగా సాగుతోందన్న అమెరికా
- చర్చలకు సిద్ధమేనని, కానీ షరతులు వర్తిస్తాయని స్పష్టం
- హోర్ముజ్ జలసంధిలో జోక్యం చేసుకోవద్దని ఇరాన్‌కు హెచ్చరిక

## కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ ఖాయం

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- రాహుల్‌పై మోదీ ఫైర్
- అసోంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు
- అసోం అసెంబ్లీ ఎన్నికల ఓటమితో రాహుల్ గాంధీ వంద అపజయాలను పూర్తి చేసుకుంటారని ఎద్దేవా



**వార్త సంధ్య, ఢిల్లీ, ఏప్రిల్ 01 :**
అసోంలో బీజేపీ 'హ్యాట్రిక్' విజయాన్ని సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. రానున్న అసోం అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ పూర్తి చేసే సందర్భం అవుతాయని ఎద్దేవా చేశారు. అసోంలో గత పదేళ్ల బీజేపీ పాలనా కాలాన్ని సేవ, సుపరిపాలన యుగంగా అభివర్ణించారు. అసోంలోని గోగాముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.అసోంలో యూసీసీని అమలు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలను అనుసరిస్తోందని ఆరోపించారు. సమాజంలో విభజనలు సృష్టించగల చట్టాన్ని గతంలో కూడా ఆ పార్టీ ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించిందని మండిపడ్డారు. ఆదివాసీ హక్కులను కాపాడతామని ఓటర్లకు మోదీ హామీ ఇచ్చారు."2014కి ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం మత హింసపై ఒక బిల్లును తీసుకురావడానికి ప్రయత్నించింది. ఓ నిర్దిష్ట - మిగతా 2 లో

## హైదరాబాద్‌లో 'హైడ్రా' కొరడా

- రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి
- శాస్త్రిపురంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా
- ఆటస్థలం కోసం కేటాయించిన రూ.100 కోట్ల భూమికి విముక్తి
- నిర్మాణంలో ఉన్న ఐదు జీ+3 భవనాలు నేలమట్టం
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్న అధికారులు




**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 01 :**
హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన 'హైడ్రా' మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. రాజేంద్రనగర్ మండలం శాస్త్రిపురంలో ఆటస్థలం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఐదు భవనాలను ఇవాళ కూల్చివేసింది. భారీ భద్రత నడుమ ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తిచేశారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమి విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.వివరాల్లోకి వెళితే... హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఆమోదించిన 188 ఎకరాల లేఅవుట్‌లో 6,500 చదరపు గజాల స్థలాన్ని ఆటస్థలం కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసి, నకిలీ నోటరీ పత్రాలతో ఇతరులకు - మిగతా 2 లో

## దేశమంతటా యూపీఐ సేవలు డౌన్.. యూజర్ల అసహనం!

- లావాదేవీలు విఫలమవడంతో సోషల్ మీడియాలో వినియోగదారుల ఫిర్యాదులు
- నిర్వహణ పనుల కారణంగానే అంతరాయమని అధికారికంగా ప్రకటించిన ఎస్బీఐ
- ప్రత్యామ్నాయ మార్గాలు సూచించి.. అసౌకర్యానికి క్షమాపణ చెప్పిన బ్యాంకు



2 లో

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- నేడు రాజ్యసభ ముందుకు బిల్లు
- రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్ నోటిఫికేషన్
- అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- నేడు రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనున్న కేంద్రం
- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ఆ తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్న కేంద్రం
- చర్చ నుంచి వాకౌట్ చేసిన వైసీపీ ఎంపీలు
- రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారనున్న బిల్లు





**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 01 :**
ఆంధ్రుల కల అయిన రాజధాని అమరావతికి చట్టబద్ధ హామీలో కీలక ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ముందుకు వచ్చింది. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టం- 2014లోని సెక్షన్ 5(2)కి సవరణ చేస్తూ కేంద్ర హోం శాఖ రూపొందించిన బిల్లును ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు.సుమారు 2 గంటలపాటు చర్చ తర్వాత అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు నేడు రాజ్యసభ ముందుకు రానుంది. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి అనంతరం - మిగతా 2 లో


2 లో

## ఇది చారిత్రాత్మక ఘట్టం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం..
- ఇది ప్రజా విజయం అంటూ పవన్ కల్యాణ్ ప్రకటన
- 33 వేల ఎకరాలిచ్చిన రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు వెల్లడి
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు హృదయపూర్వక కృతజ్ఞతలు

## రైతుల గౌరవం, సామాజిక ఒప్పందమే అమరావతి



- మేం రాజకీయాలు చేయడం లేదు
- బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
- లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు
- ప్రసంగించిన బీజేపీ ఎంపీ పురందేశ్వరి
- రైతుల గౌరవం, సామాజిక ఒప్పందమే అమరావతి అని ఉద్ఘాటన
- మూడు రాజధానుల నిర్ణయం పూర్తిగా అవివేకపూరితం అని విమర్శలు
- అమరావతికి కేంద్రం ఇప్పటికే భారీగా నిధులు కేటాయించిందని వెల్లడి

**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 01 :**
ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతి శాశ్వతంగా నిలవాలని, ఇది రాష్ట్రానికే గర్వకారణం కావాలని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అమరావతి అనేది కేవలం రాజధాని కాదని, - మిగతా 2 లో

# సంపాదకీయం

## యుద్ధంపై రణభేరి!



రాత్రింబగళ్లు నిప్పులు కురుస్తున్నా భూగోళంపైనున్న జనారణ్యాలన్నీ నిశ్చలన చిత్రాలై నిర్లిప్తంగా ఉండిపోతున్నాయన్న నిరాశ సర్వత్రా ఆవరించిన తరుణంలో అమెరికా వ్యాప్తంగా శనివారం ఒక మానవ మహాసముద్రం పోటెత్తింది. దశాబ్దాలనాటి వియత్నాం యుద్ధ వ్యతిరేక ర్యాలీలను తలపిస్తూ, అంతకన్నా మరిన్ని రెట్లు ఎక్కువగా నగరాలు, పట్టణాలు, మారుమూల పల్లెలన్న వ్యత్యాసం లేకుండా అమెరికాలోని అన్ని వర్గాలూ ఏకమై 3,300 నిరసన ప్రదర్శనలు నిర్వహించి ముక్తకంఠంతో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధాన్ని ఖండించిన తీరు చరిత్రలో నిలిచిపోతుంది.అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇంటా, బయటా తన అరాచకంతో ప్రజాస్వామ్యానికీ, మానవతకూ మహాపచారం చేస్తున్నారని ప్రదర్శకులు మండిపడ్డారంటే ఏడాది పాలనలో వారెంత విసిగిపోయారో అర్థమవుతుంది. ఖర్గ్ ద్వీపాన్ని బుగ్గి చేస్తానని, ఇరాన్ ఇంధన క్షేత్రాలకూ, విద్యుదుత్పాదన ప్లాంట్లకూ నిప్పెడతాననీ ట్రంప్ బెదిరిస్తున్న తరుణంలో 'నో కింగ్స్' పేరిట ఇంత పెద్దయెత్తున నిరసనలు ఎగిసిపడటం అసాధారణం. ఉత్తర ధ్రువప్రాంత అలస్కాలో కేవలం 3,000 మంది జనాభా నివసించే కోట్జెబు మొదలుకొని కరేబియన్ ద్వీపంలోని ప్యూర్టోరికో... న్యూయార్క్, వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో తదితర మహా నగరాల వరకూ ప్రదర్శకులు భారీయెత్తున పాల్గొనగా, యూరప్, లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియాల్లో సైతం 'నో కింగ్స్' ర్యాలీలు జరిగాయి.'నో కింగ్స్' ఒక్క ట్రంప్ పైన మాత్రమే కాదు... ఆయనకు అపరిమితమైన అధికా రాలు కట్టబెట్టిన, చట్టపరమైన రక్షణలిచ్చిన వ్యవస్థలన్నిటిపైనా మోగించిన రణభేరి. అధికారం అహంకరించినప్పుడూ, న్యాయం సైతం దానితో కుమ్మక్కయినప్పుడూ నడి వీధులే న్యాయస్థానాలవుతాయి. శనివారంనాటి నిరసనల సారాంశం అదే. రాచరిక, భూస్వామ్య వ్యవస్థలపై శతాబ్దాల క్రితం పోరాడి నిర్మించుకున్న ప్రజాస్వామ్యంలో వ్యవస్థలన్నీ కలిసి మరో 'రాజు'ను ప్రతిష్ఠించటానికి పూనుకోవడంపై 'నో కింగ్స్' ఒక తిరుగుబాటు.స్వదేశంలో నియంతగా మారిన పాలకుడు ప్రపంచానికి సైతం శాపంగా పరిణమించే ప్రమాదం ఉన్నదని ట్రంప్ పోకడలు చాటుతున్నాయి. నియంతృత్వం రాజ్యమేలేచోట అరాచకాలు పెరిగినప్పుడు మౌనప్రేక్షకులుగా మిగిలే సాధారణ జనంలో సైతం ఆలోచనలు రేకెత్తించడానికీ, కార్యోన్ముఖుల్ని చేయటానికీ ఈ నిరసనలు పుట్టు కొస్తాయి. రిపబ్లికన్‌ల ఆధిక్యతగల రాష్ట్రాలూ, 'మాగా' ఉద్యమ ప్రాబల్యంగల ప్రాంతాలూ సైతం ఈసారి నిరసనలతో హోరెత్తటం గమనించదగ్గది. జనహననం కోసం పశ్చిమాసియాకు ట్రంప్ తరలించిన మెరైన్ల తల్లులు కూడా ఇందులో పాల్గొన్నారు.నెలక్రితంతో పోలిస్తే... వారం రోజులుగా ఇరాన్ ప్రతిదాడుల సంఖ్య తగ్గిందనీ, రోజుకు 30 మించటం లేదనీ అంటున్నారు. కానీ అవి నేరుగా లక్ష్యాన్ని గురి చూస్తున్నాయి. వ్యూహాత్మక ప్రాంతాల్లో ఇరాన్ ప్రయోగించిన క్షిపణిని ప్రత్యర్థి పక్షాలు నిలువరిస్తున్నా అది కిందపడుతూ పదుల బాంబులై పేలటం, జననష్టంతోపాటు ఆస్తి నష్టం తీసుకురావటం కనబడుతూనే ఉంది. ఎదురుదాడుల క్రమంలోనే అంచనాలు పదు నెక్కించుకుని, నిఘా కార్యకలాపాలను సమన్వయపరుచుకుని ఇరాన్ దళాలు వ్యవహ రిస్తున్నాయని ఇది తేటతెల్లం చేస్తోంది. గల్ఫ్ దేశాల్లో, ఇజ్రాయెల్‌లో లక్షలాదిమంది పౌరులు ఇప్పటికీ బాంబు షెల్టర్లలో తలదాచుకొనక తప్పని స్థితి ఉంది. ప్రత్యర్థి పక్షాల ప్రాంతాల్లో ఒకసారంటూ అస్థిర పరిస్థితుల్నీ, అభద్రతా భావాన్నీ తీసుకొచ్చాక దాడుల సంఖ్య గణించదగ్గది కాదు. గత జూన్‌లో 12 రోజుల అమెరికా, ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్ విశ్రమించలేదని తాజా పరిణామాలు చెబుతున్నాయి.ఈ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజల జీవితాలనూ అస్తవ్యస్తం చేస్తోంది. వారి జీవికను దెబ్బతీస్తోంది. ఇరాన్‌పై యుద్ధం ఆపకుండా, హార్మూజ్ జలసంధి మాత్రం ప్రశాంతంగా ఉండాలనీ, ఇంధన రవాణా నిరాటంకంగా జరగాలనీ ట్రంప్ కోరుకోవటం దురాశ. ఇంధన ధరలు మిన్నంటితే తన కొలువుకు ఎసరొస్తుందన్న ఏకైక భయంతోనే పశ్చిమాసియాలో ప్రస్తుతం ఆయన వేలాదిమంది మెరైన్లను మోహరించారు. అమెరికా ప్రజల అభీష్టమేమిటో తెలిసింది గనుక ఇకనైనా ట్రంప్ తన దుష్ట పోకడలకు స్వస్తి చెప్పాలి.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలి: ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా అన్న అనుమా నానికి ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుందని బిల్లుపై చర్చలో ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత ఇచ్చేందుకు అంగీకరించిన ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అనేది చంద్రబాబు ఆశయం, కల, ధ్యేయమని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమి ఐక్యతకు కంకణబద్ధుడైన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని కొనియాడారు. జగన్ అణచివేత వల్లే అమరావతి ఒక ఉద్యమంగా మారి దేశాన్ని ఆకర్షించిందని పెమ్మసాని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుందని, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. అమరావతి ఏపీ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయం, మార్పు కేంద్రం పరిధిలోనే ఉంటుందని 2022లో సుప్రీంకోర్టు చెప్పిందని పెమ్మసాని చంద్రశేఖర్ పునరుద్ఘాటించారు.అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంటులో చర్చ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అమరావతి చట్టబ ద్ధతకు మద్దతిస్తున్నట్లు ప్రకటిం చారు. అమరావతికి తగినన్ని నిధులు అందించి ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేలా కేంద్రం సహకరించాలని కోరారు.ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని మాణికం ఠాగూర్ అన్నారు. మిగిలిన హామీ లన్నీ అమలు చేసి విభజనతో నష్టపోయిన ఏపీని ఆదుకోవాలని కోరారు.

**తప్పనిసరి పరిస్థితుల్లో రాజధాని ఏర్పడింది:** రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో ప్రకటించారు. రాజధాని విషయంలో గత ప్రభుత్వం చాలా ఇబ్బందులు తెచ్చిందని గుర్తుచేసిన బాలశౌరి ప్రజల పూర్తి మద్దతున్న అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలని కోరారు. దేశం మొత్తం రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలిపితే వైఎస్సార్సీపీ మాత్రం వ్యతిరేకించడం దురదృష్టకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు సందర్భంగా లోక్‌సభలో కలిశెట్టి మాట్లాడారు. వైఎస్సార్సీపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేసి రైతుల త్యాగాలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసంబద్ధంగా జరిగిన విభజన వల్ల నవ్యాంధ్రప్రదేశ్‌కు తప్పనిసరి పరిస్థితుల్లో అమరావతి రాజధానిగా ఏర్పడిందని బీజేపీ ఎంపీ పురందేశ్వరి అన్నారు. అలాంటి రాజధానిని వైఎస్సార్సీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు అనిశ్చితిలోకి నెట్టేశాయని ఆక్షేపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు-2014 పార్లమెంటు ఆమోదం పొందిందని పురందేశ్వరి గుర్తేచేశారు. కాబట్టి రాజధాని మార్పు విషయం కూడా పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాజధాని విషయంలో మరో రాష్ట్రానికి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు అమరావతికి చట్టబద్ధత బిల్లు చట్టరూపం దాల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అమరావతి చట్టబద్ధత చట్టంతో ఆంధ్రప్రదేశ్‌లో ఇక మూడు ముక్కలాటలు సాగబోవని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉద్ఘాటించారు. పార్లమెంటులో అమరా వతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టాక చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాజధాని అనేది కొన్ని నిర్మాణాల సముదాయమో, ఒక నగరమో కాదని సీఎం రమేష్ అన్నారు. అమరావతి తెలుగు ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అమరావతిని నాశనం చేయడానికే పూనుకుని అదే పనిగా దుశ్చర్యలకు పాల్పడిందని ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 30 ఏళ్లూ ఎన్డీఏ కూటమి పాలనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఎవరూ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదల్చలేరని కుండబద్ధలు కొట్టారు.

**అమరావతి బిల్లుకు వైఎస్సార్సీపీ వ్యతిరేకం:** అమరావతికి వ్యతిరేకం కాదంటూనే చట్టబద్ధత బిల్లును వైఎస్సార్సీపీ వ్యతిరేకించింది. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లును వ్యతిరేకిస్తున్నామంటూ వైఎస్సార్సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. అమరావతి పేరుతో హడావుడిగా బిల్లు తెచ్చేస్తే సరిపోదని రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇది చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత త్యాగాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. "తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000 ఎకరాలకు పైగా భూములను రాజధాని కోసం త్యాగం చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవరూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.గత ప్రభుత్వ తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొందని పవన్ విమర్శించారు. రైతుల పోరాటాలు, మహిళల ఆవేదన, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలు అసాధారణమైన ధైర్యాన్ని, స్పష్టతను ప్రదర్శించారని కొనియాడారు. స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజలు అభివృద్ధికి, సుస్థిరతకు పట్టం కట్టారని అన్నారు.పార్లమెంటు ఆమోదంతో రాష్ట్ర ప్రజల్లోనే కాకుండా, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లోనూ బలమైన, పునరుత్తేజంతో కూడిన విశ్వాసం ఏర్పడిందని పవన్ అభిప్రాయపడ్డారు. అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం, సమష్టి కృషికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్, ప్రధాని మోదీ ఆవిష్కరించిన వికసిత భారత్ లక్ష్యాల సాధనలో అమరావతి కీలక పాత్ర పోషిస్తుందని ఆయన దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ ఖాయం

**మొదటిపేజీ తరువాయి -** ఓటు బ్యాంకును సంతృప్తి పరచడమే ఈ బిల్లు లక్ష్యం. ఈ బిల్లు హింసకు పాల్పడిన వారిలో మెజారిటీ వర్గాన్ని దోషులుగా, మైనారిటీలను బాధితులుగా చిత్రీకరిస్తుంది. ఇది విభజనవాద బిల్లు. బీజేపీ దీనిని వ్యతిరేకించింది. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే సమాజంలోని మెజారిటీ వర్గం ఎంతటి వేధింపులను ఎదుర్కొని ఉండేదో ఊహించండి. ఇప్పుడు 12 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ అసోంలో అలాంటి బిల్లునే తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఎన్ని కల్లో గెలవడానికే కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నారు.గత పదేళ్లలో అసోం అభివృద్ధిలో సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించిందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుత యువతరం బీజేపీ సుపరిపాలనను మాత్రమే చూశారే తప్ప, కాంగ్రెస్ పార్టీ చీకటి పాలనను చూడలేదన్నారు. గత దశాబ్ద కాలంలో అసోం అభివృద్ధిలో ఒక సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసిందన్నారు. గత పదేళ్ల కాలంలో అసోంకు చెందిన వేలాది మంది యువత తుపాకులను పక్కన పెట్టి భవిష్యత్తుపై దృష్టిసారించారని తెలిపారు. కాంగ్రెస్ తన పాలనలో మౌలిక సదుపాయాల లోపాలను సరిదిద్దడంలో విఫలమైందని ఆరోపించారు."మొదట శర్బానంద సోనోవాల్ నాయకత్వంలో, ఆ తర్వాత హిమంత బిశ్వశర్మ మార్గదర్శకత్వంలో గత పదేళ్లుగా అసోం సేవ, సుపరిపాలన అనే కొత్త శకాన్ని చూసింది. త్వరలో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు అభివృద్ధి చెందిన అసోంను నిర్మించే ఎన్నికలు. మరికొద్ది రోజుల్లో జరగబోయే అసోం శాసనసభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏకు హ్యాట్రిక్ విజయం ఖాయం. అలాగే కాంగ్రెస్‌కు ఓటముల హ్యాట్రిక్ కూడా ఖాయం. అంతేకా కుండా కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ కూడా ఖాయంగా కన్పిస్తోంది. అసోం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ఇదే నా మొదటి బహిరంగ సభ. ఇక్కడ కనిపిస్తున్న ఈ జనసముద్రమే మూడోసారి ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని చెప్పడానికి నిదర్శనం. ప్రజల ఆశీస్సులతో నేను వరుసగా మూడు సార్లు ప్రధానమంత్రి పదవిని అధిరోహి ంచాను.బీజేపీ పాలనలో అసోం సాధించిన అభివృద్ధిని, కమలం పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించారు. ప్రజల నుంచి లభిస్తున్న విస్తృత మద్దతు, ఉత్సాహమే అసోం ఎన్ని కల్లో వరుసగా మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుం దనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా రాష్ట్రంలోని 15 లక్షలకు పైగా కుటుంబాలు లబ్ధి పొందు తాయని వెల్లడించారు. లఖ్‌పతి దీదీ పథకం ద్వారా 40 లక్షల మహిళలకు ప్రయో జనం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. అసోంలో ఉన్న 126 అసె ంబ్లీ నియోజకవర్గాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తారు. బీజేపీ నేతృ త్వంలోని ఎన్ డీఏకి,కాంగ్రెస్ పార్టీకి మధ్య ఈ ఎన్నికల్లో హోరాహోరీ పోరు జరగనుంది.

## ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు



**మొదటిపేజీ తరువాయి -** యూరప్‌లోని సుదూర ప్రాంతాలను సైతం తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా చేపట్టిన సైనిక చర్యను సమర్థిస్తూ, ఇరాన్ ఆయుధ కార్యక్రమాలతో ప్రపంచానికి పెను ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు.ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రూబియో మాట్లాడుతూ, ఇరాన్ ఇటీవల ప్రయోగించిన క్షిపణులు తమ అంచనాలకు మించిన సామర్థ్యాన్ని ప్రదర్శించాయని తెలిపారు. "ఆ క్షిపణులు యూరప్‌లోని చాలా ప్రాంతాలకు చేరగలవు" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా ప్రధాన భూభాగాన్ని కూడా లక్ష్యంగా చేసుకునే దీర్ఘశ్రేణి క్షిపణుల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలను వేర్వేరుగా చూడలేమని రూబియో స్పష్టం చేశారు. "ఇరాన్ ఇప్పటికే 60 శాతం స్వచ్ఛతతో యురేనియంను శుద్ధి చేసింది. కేవలం 12 నుంచి 14 రోజుల్లోనే దాన్ని 90 శాతం స్వచ్ఛతకు (అణుబాంబు తయారీకి అవసరమైన స్థాయి) చేర్చగలదు. అణుబాంబులో ఉపయోగించడానికి తప్ప 60 శాతం శుద్ధి చేసిన యురేనియం వల్ల మరో ప్రయోజనం ఉండదు" అని ఆయన వివరించారు.ఇరాన్ తన అణు కార్యక్రమానికి రక్షణ కవచంగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించేందుకే సైనిక చర్య ప్రారంభించామని రూబియో తెలిపారు. ఇరాన్ వాయుసేన, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, క్షిపణి లాంచర్లను నిర్వీర్యం చేయడం, డ్రోన్లు, క్షిపణుల తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేయడం వంటి నాలుగు లక్ష్యాలతో ఈ ఆపరేషన్ సాగుతోందని చెప్పారు. "ఈ లక్ష్యాల సాధనలో మేము అనుకున్నదానికంటే వేగంగా ఉన్నాం. లక్ష్యానికి చాలా దగ్గరగా ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.సైనిక చర్య కొనసాగుతున్నప్పటికీ, చర్చల ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇరుపక్షాల మధ్య సందేశాలు మార్పిడి జరుగుతున్నాయని రూబియో అన్నారు. అయితే, చర్చల పేరుతో కాలయాపన చేయడాన్ని సహించబోమని, దొంగచాటు చర్చలకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. హార్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఇరాన్ ఆటంకం కలిగిస్తే అది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు.

## అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం తప్పుగా మాట్లాడారు



**మొదటిపేజీ తరువాయి -** ఎమ్మెల్యేను కాదని ఆయనకు టిక్కెట్ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గత ఎన్నికల్లో పోటీ చేసిన కడియం శ్రీహరిని తాము మీరు ఏ పార్టీలో ఉన్నారని సభలో అడిగితే తప్పేమిటని ప్రశ్నించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీలో ఉంటే కేసీఆర్, హరీశ్ రావుపై విమర్శలు ఎందుకు చేశారో చెప్పాలని అన్నారు. సభలో ఆయన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల వద్ద కూర్చున్నారని, అందుకే అడిగామని వెల్లడించారు. అసలు ఆయన ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో చెప్పాలని నిలదీశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో జరిగే మైనింగ్ కుంభకోణాన్ని హరీశ్ రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని అన్నారు. మైనింగ్ స్కాం మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. హౌస్ కమిటీ వేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న సమస్య ఏమిటని ప్రశ్నించారు.సీఐడీ విచారణకు ఆదేశిస్తామని ప్రభుత్వం చెబుతోందని, మంత్రి మీద సీఐడీ విచారణ వేస్తే న్యాయం జరుగుతుందా అని నిలదీశారు. మంత్రిని అధికారులు విచారించే అవకాశం ఉంటుందా అని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ తనను టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని అన్నారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు

**మొదటిపేజీ తరువాయి -** కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానా శ్రయం ఉందని అన్నారు.దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరపున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

## దేశమంతటా యూపీఐ సేవలు డౌన్.. యూజర్ల అసహనం!

**మొదటిపేజీ తరువాయి -** దేశవ్యాప్తంగా నేడు డిజిటల్ చెల్లింపు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేకమంది వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించింది.ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే 500కు పైగా ఔటేజ్ రిపోర్టులు రాగా, యూకో బ్యాంకుకు సంబంధించి దాదాపు 40 ఫిర్యాదులు నమోదయ్యాయి. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పుణె వంటి ప్రధాన నగరాలతో పాటు కోల్‌కతా, గువాహటి, చెన్నై నుంచి కూడా వినియోగదారులు లావాదేవీలు విఫలమయ్యాయని తెలిపారు.ఈ సమస్యపై చాలామంది ఎక్స్ వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. కొందరి లావాదేవీలు మధ్యలోనే ఆగిపోగా, మరికొందరి యూపీఐ యాప్‌లు పూర్తిగా లోడ్ అవ్వలేదు.ఈ అంతరాయంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. షెడ్యూల్ ప్రకారం చేపట్టిన నిర్వహణ పనుల సమయాన్ని ఏప్రిల్ 1వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల వరకు పొడిగించినట్లు తెలిపింది. "ఈ సమయంలో యూపీఐ, ఐఎంపీఎస్, యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవల్లో అంతరాయం కలగవచ్చు," అని పేర్కొంది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు యూపీఐ లైట్, ఈ-రూపీ (సీబీడీసీ) యాప్, ఏటీఎం సేవలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించింది.

## హైదరాబాద్‌లో 'హైడ్రా' కొరడా

**మొదటిపేజీ తరువాయి -** ప్లాట్లుగా విక్రయించారు. ఈ స్థలంలో నిర్మాణంలో ఉన్న ఐదు జీ+3 భవనాలతో పాటు మరో రెండు చిన్న నిర్మాణాలను కూడా హైడ్రా బృందాలు నేలమట్టం చేశాయి. అయితే, మరో రెండు భవనాల్లో కొన్ని కుటుంబాలు నివసిస్తుండటంతో మానవతా దృక్పథంతో వాటిని కూల్చివేయలేదు.గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ కబ్జాదారులకు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోలేదు. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులతో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, కబ్జాలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు.చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు 2024లో తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు రూ.60,000 కోట్ల విలువైన 1,045 ఎకరాల ప్రభుత్వ భూములు, జలవనరులను తిరిగి స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో బంజారాహిల్స్‌లో రూ.750 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

## తెలంగాణలో మీ సేవ కేంద్రాల్లో ఛార్జీల పెంపు

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాష్ట్రంలో మీసేవ కేంద్రాల్లో అన్ని సేవల ధరలను పెంచారు. ఆయా సర్వీసులపై ధరలను 50 శాతం మేర పెంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రుసుంను రూ.80కి పెంచారు. జనన ధృవీకరణ పత్రం రుసుం రూ.62 చేశారు. కేటగిరీ 'ఏ' మరియు కేటగిరీ 'బి' కింద వచ్చే దాదాపు అన్ని సేవలపై కూడా ధరలను పెంచింది.ఇప్పటి వరకు 'ఏ' కేటగిరీ కింద కనీస ఛార్జీ రూ.35 ఉండగా, దానిని రూ.35కు పెంచారు. ఇందులో అడంగల్, పహాణీ వంటి తక్షణ సేవలు ఉంటాయి. కేటగిరీ 'బీ' సర్వీసుల ఛార్జీని రూ.80కి పెంచారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ప్రాసెస్ అయ్యే కుల, ఆదాయ ధృవీకరణ వంటి సేవల ధరలు రూ.80కి పెరిగాయి. ఇవి నేటి నుంచి అమల్లోకి వచ్చాయి.మీ సేవ కేంద్రాల నిర్వహణ ఖర్చు పెరిగినందువల్ల ధరలను పెంచాలని నిర్వాహకులు కోరారు. ఈ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ధరల సవరణ చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల ధరల పెంపు చోటుచేసుకుంది.

# మేం రాజకీయాలు చేయడం లేదు

**మొదటిపేజీ తరువాయి -** అదొక విశ్వాసం, త్యాగం, సామాజిక ఒప్పందం అని ఆమె అభివర్ణించారు. అమరావతి అంశం ఒక వివాదం కాదని, ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ఇదొక పరీక్ష అని పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయం కోసం, రైతుల గౌరవం కోసం, ప్రజల కోసం అమరావతిని నిలబెట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఇవాళ లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. మేము ప్రత్యేక హోదా అడగడం లేదు.. మేము రాజకీయాలు చేయడం లేదు... మేము కోరేది ఒక్కటే... న్యాయం, స్థిరత్వం, రైతుల విశ్వాసానికి గౌరవం అని ఉద్ఘాటించారు.29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 34,000 ఎకరాల భూమిని ఇచ్చారని, ఈ 'ప్రజల రాజధాని' దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. రైతుల త్యాగాన్ని వృథా కానివ్వకూడదని, వారి 1600 రోజుల నిరసన ప్రజాస్వామ్య స్ఫూర్తికి అద్దం పడుతోందని పేర్కొన్నారు.2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయం పూర్తిగా అవివేకపూరితమైనదని పురందేశ్వరి తీవ్రంగా విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం రాజధాని అంశం పార్లమెంట్ పరిధిలోకి వస్తుందని ఆమె స్పష్టం




చేశారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో తీవ్ర అన్యాయానికి గురైన ప్రజలు ఇప్పుడు స్థిరత్వం, న్యాయం మాత్రమే కోరుకుంటున్నారని వివరి ంచారు.అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే భారీగా నిధులు కేటాయించిందని పురందేశ్వరి తెలిపారు. క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.1500 కోట్లు, రింగ్ రోడ్ ప్రాజెక్ట్‌కు రూ.20,000 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వీటితో పాటు హడ్కో ద్వారా రూ.11,400 కోట్లు, ప్రపంచ బ్యాంకు సహకారంతో మరో రూ.15,000 కోట్ల నిధులు సమీకరించేందుకు మార్గం సుగమమైందని చెప్పారు. ఈ నిధులు అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు బలమైన పునాది వేస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

# అకాల వర్షంతో పంటలకు దెబ్బ

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



**సారంగాపూర్ మండలం (వార్త సంధ్య) ఏప్రిల్ 1 :** జిల్లాలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో కోత దశలో ఉన్న పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి, పెంబట్ల గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఆయన, లక్ష్మీదేవిపల్లిలో రైతు రవి నాయక్‌కు చెందిన బీరకాయ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో మాట్లాడిన జీవన్‌రెడ్డి, జిల్లాలో మొక్కజొన్న పంట అధికంగా ఉండగా అకాల వర్షాలతో అనేక ప్రాంతాల్లో పంటలు నేలకొరిగాయని తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కలెక్టర్ ద్వారా నష్టం అంచనా వేయించి చర్యలు చేపట్టాలని కోరారు. మొక్కజొన్న, నువ్వులు, కూరగాయల పంటలు, మామిడి తోటలు పూర్తిగా దెబ్బతినడంతో ఎకరాకు రూ.20--30 వేల వరకు పెట్టుబడి నష్టపోయారని పేర్కొన్నారు. మార్కెట్‌లో మొక్కజొన్న ధర క్వింటాల్‌కు రూ.1800--1900 మాత్రమే ఉండటంతో ప్రతి క్వింటాల్‌కు సుమారు రూ.500 వరకు నష్టం వస్తోందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోరినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. మార్క్‌ఫెడ్ ద్వారా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని, లేకపోతే దళారులు లాభపడతారని హెచ్చరించారు. పంటల బీమా అమలు లేక రైతులు పూర్తిగా నష్టపోతున్నారని, తక్షణమే సర్వేలు చేసి కనీసం ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని కోరారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

## మేడిపల్లి రాజన్న శర్మ సేవలు మరువలేనివి



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఏప్రిల్ 1 (వార్త సంధ్య);** జగిత్యాల పట్టణం మార్కెట్లోని శ్రీశ్రీనివాస ఆంజనేయ భవాని శంకర దేవాలయ ప్రధాన అర్చకులు మేడిపల్లి రాజన్న శర్మ ఆధ్యాత్మిక సేవలు మరువలేనివని ఆలయ చైర్మన్ బాశెట్టి లవకుమార్, ఈవో సంగెం సురేందర్ లు అన్నారు. దేవాలయంలో ప్రధాన అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న మేడిపల్లి రాజన్న శర్మ పదవి విరమణ పొందగా బుధవారం దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మశ్రీ మేడిపల్లి రాజన్న శర్మ దేవాలయ ప్రధాన అర్చకుడిగా విధులను అంకితభావంతో నిర్వహించారన్నారు. పదవీ విరమణ అనంతరం వారి భావి జీవితం సుఖ సంతోషాలతో వెలుగొందాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా మేడిపల్లి రాజన్న శర్మ-పద్మ దంపతులను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఫౌండర్ ట్రస్టీలు మంచాల రాంగోపాల్, గౌరీశెట్టి రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ లు జి ఆర్ దేశాయి, గోలి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు గౌరీశెట్టి గణేష్,రాగి వెంకటేశం, బంగ్లా శేఖర్, సత్తయ్య, గౌరీశెట్టి సాధన, ఉమాభారతి, రుద్రంగి గోపాలకృష్ణ, శశాంక మౌళి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు అంకు సురేందర్



**అచ్చ పేట ప్రతినిధి, ఏప్రిల్ 1 (వార్త సంధ్య):** వంగూరు మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన కొమ్ము పద్మ (ఎర్రమ్మ) అనారోగ్యంతో ఈరోజు మృతి చెందగా బీ ఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు అంకు సురేందర్ నివాళులు అర్పించారు.మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన తక్షణమ్మ తన వంతు సాయంగా పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు వారితో పాటు రజక సంఘం జిల్లా అధ్యక్షులు జూపల్లి జంగయ్య మైనర్టీ నాయకులు సయ్యద్ నిజాముద్దీన్ వార్డ్ మెంబర్స్ తాడేం రేణుక రవి మీసాల శ్రీకాంత్ సుర్వి శ్రీను నాయకులు నరేందర్ గౌడ్ కడారి మల్లయ్య,సుర్వి గోపాల్ డొక్కు సాయిలు సుర్వి శంకరనంద్ మీసాల కుమార్ మద్దెల బండ సుధాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఐకాన్ పురస్కారానికి దరఖాస్తు ఆహ్వానం.



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో రిపోర్టర్ ఏప్రిల్ 1(వార్త సంధ్య):** అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంస్థ 6వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఐకాసా పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సరోజమ్మ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. డాక్టర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్ రాం జయంతి సందర్భంగా ఆంధ్ర డొక్కా సీతమ్మ, అన్నపూర్ణాదేవిగా ప్రఖ్యాతి గాంచిన వేటూరి సుందర రామ్మూర్తి . ఏ పాత్రనైనా అవలీలగా చేయగలిగిన బెస్ట్ యాక్టర్ సౌందర్య వీరి పేర్ల మీదుగా స్వర్ణ నంది , జాతీయ వికాసా పురస్కారాలు అందజేస్తున్నట్లు సరోజనమ్మ తెలిపారు. జానపద కళాకారులు ,నాయకులు, సమాజ సేవకులు ,టీవీ యాంకర్, కళాకారులు నూతనంగా ఎంపికైన ఉత్తమ సేవానందిస్తున్న వారు విశిష్ట భక్తులకు ఈ ఐకాసా అవార్డ్స్ తో సత్కరం అందజేస్తామని ఆమె అన్నారు. అర్హత కలిగిన ఆసక్తి ఉన్నవారు ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 12వ తేదీ హైదరాబాద్ రవీంద్రభారత్ లో పురస్కారం అందజేస్తున్నామని ఆమె తెలిపారు. మరికొన్ని వివరాలకు6302908528 నెంబర్ల కు సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

## పారాక్వెట్ గడ్డి మందు నిషేధం లో కీలక పాత్ర పోషించిన జై స్వరాజ్ పార్టీ

### పూర్తి నిషేధానికి చర్యలు తీసుకోవాలి

### మందును నిషేధించిన ప్రభుత్వానికి రైతుల తరపున ధన్యవాదాలు

### జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఏప్రిల్ 1 :** పారాక్వెట్ గడ్డి మందు నిషేధంలో జై స్వరాజ్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, తెలంగాణలో రోజుకు అనేక మంది రైతులు ఈ మందు కారణంగా చనిపోతున్న విషయాన్ని వ్యవసాయ అధికారులకు తాను వివరించానని, అదే విధంగా ప్రభుత్వానికి లేఖ రాశామని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వెంటనే గడ్డి మందును ముందుగా 60 రోజుల నిషేధానికి ఉత్తర్వులు జారీ చేసిందని, ఇందుకు రైతుల మేలు కోరుకునే జై స్వరాజ్ పార్టీ రైతుల తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నదని, అలాగే శాశ్వత నిషేధానికి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోవాలని కేఎస్ఆర్ గౌడ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం తదుపరి పూర్తి నిషేధానికి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆయన కోరారు. వ్యవసాయ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెస్టిసైడ్ షాపుల్లో ఈ గడ్డి మందు లేకుండా చేయాలని ఆయన ప్రభుత్వానికి తెలిపారు.

## కూకట్‌పల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో ఘనంగా 'పంగుని ఉత్తిరం' వేడుకలు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అత్యంత వైభవంగా జరుపుకునే అయ్యప్ప స్వామి జయంతి (పంగుని ఉత్తిరం) వేడుకలు బుధవారం కూకట్‌పల్లిలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. శబరిమలలో బ్రహ్మోత్సవాల ముగింపు పర్వదినం కావడంతో, ఇక్కడ కూడా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ వేడుకలను పురస్కరించుకొని దేవస్థానం చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చక స్వాముల పర్యవేక్షణలో స్వామివారికి నిర్వహించిన అభిషేకం, అర్చన, హారతుల్లో ఆయన పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ధర్మానికి ప్రతీక అయ్యప్ప స్వామి ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి జయంతి నియమానికి, ధర్మానికి, మరియు నిరుపమ భక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. "పంగుని ఉత్తిరం పర్వదినం మనలోని దైవత్వాన్ని మేల్కొలిపే పవిత్ర ఘడియ. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని, అందరికీ అభివృద్ధి కలగాలని ప్రార్థించాను" అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను అందుకున్నారు.

## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రి తుమ్మల



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఏప్రిల్ 1 :** రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ లో 112 శాతం అచీవ్ మెంట్ తో రాష్ట్రం దేశంలోనే ముందు వరుసలో ఉందని కేంద్ర మంత్రికి తెలిపిన మంత్రి తుమ్మల రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చే మూడు నెలలలో పాస్ బుక్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేస్తామని తెలిపిన మంత్రి తుమ్మల రాష్ట్రంలో యూరియా లభ్యత యూరియా యాప్ అమలు విధానం గురించి కేంద్ర మంత్రికి వివరించిన మంత్రి తుమ్మల ఈ ఖరీఫ్ లో కేంద్ర కేటాయిం పులకు అనుగుణంగా రాష్ట్రానికి సమయానికి యూరియా సరఫరా చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి

## ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఏప్రిల్ 1 :** కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్ కు హోం గార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసిన సీఎం. ట్యాంక్ బండ్ పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ... ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరిన ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితి. ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివ. ట్యాంక్ బండ్ శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం అధికారులను ఆదేశించిన సీఎం ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని కోరిన ట్యాంక్ బండ్ శివ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన సీఎం. శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం సీఎం చేతులమీదుగా సాయం అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ట్యాంక్ బండ్ శివ, కుటుంబసభ్యులు.

## చిత్తారమ్మ ఆలయంలో వైభవంగా శ్రీ మహాలక్ష్మి యాగం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** బ్రహ్మాది దేవతల మొదలు మానవుల వరకూ అందరికీ ఐశ్వర్యం, మంగళ సౌభాగ్యాలు ప్రసాదించే శ్రీ లక్ష్మీ అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకుని కూకట్‌పల్లిలోని శ్రీ శ్రీ శ్రీ చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ మహాలక్ష్మి యాగం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. శ్రీ మహాలక్ష్మి యాగ సమితి ఆధ్వర్యంలో, వడ్డేపల్లి రాజేశ్వరరావు - యామిని దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఘనంగా సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానం పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సాగిన ఈ వేడుకల్లో భాగంగా: ?ప్రవేశ బలి, లక్ష్మీనరసింహారాధన గోపూజ, లక్ష్మీనారాయణ పూజ శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.

**ప్రతి ఇంటా ఐశ్వర్యం నిండాలి:**

వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. "అమ్మవారి దయాకటాక్షాలు భక్తులపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం, శాంతి నెలవాలని కోరుకుంటున్నాను. సానుకూలతను, ధార్మికతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయి," అని పేర్కొన్నారు. కార్యక్రమ విజయానికి కృషి చేసిన యాగ సమితి సభ్యులకు, పాల్గొన్న భక్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ మహా యాగంలో రఘు గురూజీ, జి. నాగేశ్వరావు, ఏ. హనుమంతరావు, ఏ. ఆండాలమ్మ, అశోక్ యాదవ్, గొట్టిముక్కల భాస్కరరావు, మాధవరం నాగేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు

## పదవీ విరమణ చేయబోతున్న వైఎస్ఆర్సిపి గ్రామ సర్పంచ్ లకు ఘన సన్మానం...



**విస్సన్నపేట,ఏప్రిల్ 01(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం** పదవీ విరమణ చేయబోతున్న వైఎస్ఆర్సిపి గ్రామ సర్పంచ్ లకు వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం విస్సన్నపేట లో నిర్వాహించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాసు. జడ్పిటిసి సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వర్ రెడ్డి. పార్టీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు. పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు. లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి శిరసాని ప్రకాష్.. ఆయా గ్రామాల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కుమ్మరుల మనోభావాలను దెబ్బతీసేలా పాటలో ఉన్న మాటల్ని తొలగించాలి



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఏప్రిల్ 1 (వార్త సంధ్య):** జానపద గాయకుడు రచయిత మల్లిక తేజ చిత్రీకరించిన పాటలు కుమ్మర మహిళలను కించపరిచేలా ఉన్న పదాలను తొలగించి కుమ్మర సామాజిక వర్గానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని శాలివాహన కుమ్మరి కుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి కృష్ణ పత్రిక ముఖంగా డిమాండ్ చేశారు. జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ జిల్లాకు చెందిన గాయకుడు రచయిత మల్లిక్ తేజ గుణ గుణ నడిచే టైటిల్ తో కూడిన పాటను చిత్రీకరించి యూట్యూబ్ ఛానల్ లో జానపద గేయాన్ని అప్లోడ్ చేశాడని, సదరు పాటలో కుమ్మరి కులానికి చెందిన మహిళలు యువతులను కించపరిచేలా పదాలు ఉన్నాయని ఇప్పటికే ఈ పాట పలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్నాయని ఈ పాట వల్ల కుమ్మరుల మనోభావాలు దెబ్బతిన్నయని, సమాజంలో మహిళలు వివక్షను ఎదుర్కొనే విధంగా పాటలో పొందుపరిచిన పాదాలను గాయకుడు వెంటనే తొలగించాలని సామాజిక మాధ్యమాల్లో అప్లోడ్ చేసిన వీడియోలను తొలగించి కుమ్మరి సామాజిక వర్గానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

**సంబంధిత పదాలను తొలగిస్తా...**

ఏ వర్గాన్ని ఏ కులాన్ని కించపరచడం తన అభిమానం కాదని కుమ్మరి కులానికి చెందిన పదాలను పాటలోంచి తొలగించిన తర్వాతనే పాటను విడుదల చేస్తానని ఈ సందర్భంగా గాయకుడు రచయిత మల్లిక్ తేజ ఇదే సమావేశంలో పేర్కొన్నారు. శాలివాహన కుమ్మర సంఘం జిల్లా రాజకీయ విభాగం అధ్యక్షుడు కేశేటి రమేష్ ,కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి-శ్రీనివాస్, మొండయ్య,గంగారెడ్డి తదితరులు పాలొగొన్నారు

## రోడ్డుపై రక్తపాతం......!

### టేకులపల్లి మండలంలో హత్యాయత్నం...


### తృటిలో తప్పిన ప్రాణాపాయం



**భద్రాద్రి జిల్లా క్రైమ్, ఏప్రిల్ 01 (వార్త సంధ్య) :** టేకులపల్లి మండలంలో పాత కక్షలు మరోసారి హింసకు దారి తీశాయి. గోలియా తండాకు చెందిన బానోత్ బిక్కులాల్‌పై తండ్రి--కొడుకు కలిసి దాడి చేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. మంగళవారం రాత్రి బిక్కులాల్ తన స్నేహితుడిని బైక్‌పై ముత్యాలంపహాడ్ వద్ద దించేందుకు వెళ్తుండగా, బోడా పూల్ సింగ్, బోడా వినోద్ నాయక్ ముందే పథకం ప్రకారం బైక్‌ను అడ్డగించారు. ఇద్దరూ కలిసి బిక్కులాల్‌ను కింద పడేసి జాకీ రాడ్, కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం రోడ్డుపక్కన పడేసి పరారయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేందర్ ఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని ఆసుపత్రికి తరలించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాల కారణంగా బిక్కులాల్‌ను కొత్తగూడెం ఆసుపత్రికి తరలించగా, అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. గతంలో కూడా ఇదే కుటుంబాల మధ్య వివాదాలు జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

## నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ నిరసన బ్లాక్ డే లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

### పాల్గొన్న ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య



**భద్రాద్రి జిల్లా సింగరేణి, ఏప్రిల్ 01 (వార్త సంధ్య) :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు నూతన లేబర్ కోడ్ లను నిరసిస్తూ బుధవారం నాడు దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న బ్లాక్ డే పిలుపులో భాగంగా సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఇల్లందు బంగ్లోస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలను ధరించి లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, టియుసిఐ నాయకులు పి సతీష్ లు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అత్యంత నియంతృత్వ పరిపాలన సాగుతున్నదని విమర్శించారు.ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చివేసి పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా, విదేశీ బహుళ జాతి సంస్థలకు ఉపయోగపడే నాలుగు లేబర్ కోడులను 2019 నుంచి కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తూ పోరాడుతూ వస్తున్నప్పటికీ ఈ రోజు నుండి అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.ఈ నాలుగు లేబర్ కోడ్ లు వల్ల పని గంటలు పెరుగుతాయని,ఉద్యోగ భద్రత ఉండదని, వేతనాల చెల్లింపుకు గ్యారెంటీ ఉండదని అన్నారు. కార్మిక సంఘాలను, సమస్యల పరిష్కారానికి పోరాడే హక్కులను పరిమితం చేయడమే ఈ లేబర్ కోడల ఉద్దేశమని అన్నారు.ఈ నేపథ్యంలో కార్మిక వర్గం మరింత సంఘటితంగా పోరాడే తమ హక్కులను కాపాడుకోవడమే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, సుజాత, కరుణ, సరళ, కృష్ణమూర్తి, రాజేష్, చుక్కయ్య, వెంకటేశ్వర్లు రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**సమీకృత భూభారతి పోర్టల్‌తో తొలి అడుగు**

**రేపటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు**

**స్మార్ట్ ఫోన్‌తో ఇంటినుంచే భూ సేవల లభ్యత**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఏప్రిల్ 1 :-** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేరళం పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి బుధవారం నాడు ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లవలసిన పనిలేకుండా తన ఇంటి నుంచే భూ సేవలు పొందేవిధంగా పోర్టల్‌ను రూపొందించామని అన్నారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారని,. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకు ఉన్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్నిఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు ఎంతచెల్లించాలో కనిపిస్తుంది. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుంది. ఆతర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమేగాక సర్వేకూడా రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళుతుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్ల కేటాయింపు జరుగుతుంది. ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎమ్ ఎస్ అలర్ట్స్ పంపిస్తారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ ( ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదేవిధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు. ఈ ఐదు మండలాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నతర్వాత సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామని అలాగే గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. దీనివల్ల సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన సర్వే వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలు రైతు జీవితంలో పెద్ద అడ్డంకిగా మారాయని వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అని రైతు ఇంటి నుంచే అన్నిసేవలు పొందేలా పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామని ఇది రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు నాంది అవుతుందని మంత్రి పొంగులేటి అన్నారు.

## విస్తృతంగా బడిబాట ...



**ఎ కొండూరు,ఏప్రిల్ 01(వార్త సంధ్య):-** ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, ఉచితంగా నాణ్యమైన మధ్యాహ్నం భోజనం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, షూ కూడా అందిస్తామని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు ప్రధానోపాధ్యాయులు డి. శరత్ బాబు తెలిపారు.బుధవారం గ్రామంలో విస్తృతంగా బడిబాట కార్యక్రమం చేపట్టి పలువురు విద్యార్థుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం. రాం ప్రదీప్, ఉపాధ్యాయ సిబ్బంది డి. మురళీ, బి. నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## చౌక ధరల దుకాణాలు తనిఖీ..



**తిరువూరు, ఏప్రిల్01 (వార్త సంధ్య):-** ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం తిరువూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కుమార్ తిరువూరు మండలంలోని చౌక ధరల దుకాణాలను తనిఖీ చేశారు.రేషన్ పంపిణీని పరిశీలించిన సందర్భంగా, అన్ని కార్డు దారులకు తాగునీరు తప్పనిసరిగా అందించాలని, 50 నుండి 65 సంవత్సరాల వయస్సు గల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే, షాప్ టైమింగ్‌ను ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు కాకుండా ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించాలని తెలియజేశారు.

## ఇండ్ల స్థలాల కోసం ఆమరణ దీక్షకు టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధం



**ఖమ్మం, (వార్త సంధ్య):** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకూ సిద్ధమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ప్రకటించింది. ఖమ్మం నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. మొదట సంతకాల సేకరణతో కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, మంత్రుల శిబిర కార్యాలయాల ముట్టడులు, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు నిర్వహించి, చివరి దశలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు, విద్యా ఫీజుల రాయితీలు వంటి సంక్షేమ అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య కార్డులు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడటం లేదని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించిన నాయకులు, రానున్న ఉద్యమ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం రిలే నిరాహార దీక్ష నిర్వహించిన సభ్యుడు కొరకొప్పుల రాంబాబును సన్మానించారు.

# ఇంటింటికి సిపిఐ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**వందేళ్ల పోరాట చరిత్ర కలిగిన పార్టీకి అండగా నిలవాలి**

**ప్రతి గడపకు వెళ్లి కమ్యూనిస్టుల పోరాటాలను, త్యాగాలను వివరిస్తాం**

**ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యలపై పోరాడుతాం**

**మండల, పట్టణ కేంద్రాల్లో పక్షం రోజుల పాటు ఉధృతంగా కార్యక్రమం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**కొత్తగూడెం కార్పొరేషన్, ఏప్రిల్ 1 (వార్త సంధ్య) :** ప్రజా పోరాటాల స్ఫూర్తిని ఇంటింటికి తీసుకెళ్తామని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు నడుం బిగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి సిపిఐ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వివరించారు. వందేళ్ల పోరాట చరిత్ర కలిగిన పార్టీకి ప్రజలు అండగా నిలవాలని, ప్రతి గడపకు వెళ్లి కమ్యూనిస్టుల పోరాటాలను, త్యాగాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు అండగా నిలబడి వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు పక్షం రోజుల పాటు ఈ కార్యక్రమం ఉధృతంగా కొనసాగుతుందని తెలిపారు. పేదల పక్షాన నిలబడే పోరాటాల పార్టీకి ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సామాన్యుల హక్కుల సాధనకై సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ పదిహేను రోజుల ప్రచారంలో భాగంగా ప్రతి గ్రామంలోని ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వై ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్, జి.వీరాస్వామి, భూక్యా దస్రు, ఎస్ కె ఫహీమ్, కుమారి హన్మంతరావు, దీటి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుంది

**అయ్యప్ప స్వామి కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి**

**భక్తి మార్గంలో సాగే పాలాభిషేక మహోత్సవం అద్భుతం**

**శబరిమల యాత్ర క్రమశిక్షణకు, సమానత్వానికి నిదర్శనం**

**ఆలయాల అభివృద్ధిలో భక్తుల భాగస్వామ్యం అభినందనీయం**

**భక్తి మార్గం మనిషిని సన్మార్గంలో నడిపిస్తుంది**

**పవిత్ర పుణ్యక్షేత్రాలు శాంతికి నిలయాలుగా నిలవాలి**

**మత సామరస్యంతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది**

**కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 01 (వార్త సంధ్య) :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, భక్తి మార్గం మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని నాయకులు పేర్కొన్నారు. పాల్వంచ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాదని, అవి క్రమశిక్షణను, సామాజిక బాధ్యతను నేర్పే కేంద్రాలని అభివర్ణించారు. సమాజ హితం కోసం నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలని, అదే నిజమైన భక్తి అని వారు ఉద్ఘాటించారు. అయ్యప్ప స్వామి కృపతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు సాబీర్ పాషా, మూడ్ గణేష్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గొర్లె నరేష్, ప్రసాద్, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 15 న భారీ ప్రదర్శన -- సదస్సు విజయవంతం చేయాలి

**అఖిల భారత రైతు కూలీ సంఘం పిలుపు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 01 (వార్త సంధ్య) :** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా అధ్యక్షులు ఉప్పరబోయిన రామ్మూర్తి, తెలంగాణ రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా అధ్యక్షులు పున్నం చందర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 15, 2026 న నిర్వహించనున్న ప్రదర్శన--సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఐఎఫ్టియు ఈ సమావేశంలో భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్టియు) రాష్ట్ర సహాయ కార్యదర్శి కందగట్ల సురేందర్, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసాదన్న, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు మోకాళ్ళ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, గత 60 సంవత్సరాలుగా ఆదివాసీలు సాగు చేస్తున్న 11 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఫారెస్ట్ అధికారుల వేధింపులను నిలిపివేయాలని, గోదావరి ముప్పు బాధితులకు పక్కా ఇళ్లు నిర్మించాలని, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, వలస గొత్తి కోయిలకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, 1/70 యాక్ట్ వంటి చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలు కావడం లేదని, ఇప్పటికే 40 శాతం ఆదివాసీ భూములు అన్యాక్రాంతం అయ్యాయని విమర్శించారు. గోదావరి ముప్పు బాధితులకు శాశ్వత పరిష్కారం చూపకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నిర్వాసితులకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యుత్ కోతల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, 24 గంటల కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అడవి, వన్యప్రాణుల సంరక్షణ పేరిట గ్రామాలను ఖాళీ చేయించడం సరైంది కాదని, వారికి పక్కా ఇళ్లు కల్పించాలని అన్నారు. ఏప్రిల్ 15 న వ్యవసాయ మార్కెట్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి, మేధావి మోత్కూరు వెంకట్ నారాయణ తదితరులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రదర్శన--సదస్సును విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెమిడి ఉప్పలయ్య, మలుగురి సుగుణ, గుమ్మడి మారయ్య, సూరేపల్లి వెంకటేశ్వర్లు, చర్ప నారాయణ, వట్టం లక్ష్మి, గొంది లక్ష్మి, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఎస్పీ అధ్యక్షుడిగా కోళ్లపూడి ప్రవీణ్ ...



**కాంగ్రెస్ వైఫల్యాలపై నిప్పులు చెరిగిన బీఎస్పీ**

**భద్రాద్రి జిల్లా బ్యూర, ఏప్రిల్ 01 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ముఖ్య కార్యకర్తల సమావేశం ఉత్సాహంగా సాగింది. మై బాబు పార్లమెంటు ఇన్చార్జి తాండ్ర వెంకటేశ్వర్లు రాష్ట్ర కోఆర్డినేటర్ దాగిల్ల దయానంద రావు సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షులు ఇబ్రశీ శేఖర్ పాల్వంచ పట్టణానికి చెందిన కోళ్లపూడి ప్రవీణ్ కి జిల్లా అధ్యక్షుని బాధ్యతల్లో నియమించారని, జిల్లా అధ్యక్షుడిగా నియమితులైనందుకు ఎంతో సంతోషంగా ఉందని అంతే బాధ్యతతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బహుజన రాజ్యాధికారం కోసం పనిచేస్తానని కోళ్లపూడి ప్రవీణ్ అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీల పై ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కోళ్లపూడి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక అబద్ధపు హామీలు ఇచ్చిందని మండిపడ్డారు.

"ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు ఆ హామీలను తుంగలో తొక్కింది. రైతు భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం వంటి పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ దుర్వినియోగం చేస్తోంది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లాలో బీఎస్పీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని ప్రవీణ్ శపథం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను ఏకం చేసి, బహుజన గళాన్ని వినిపిస్తామని చెప్పారు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో బీఎస్పీ ఎప్పుడూ ముందుంటుందని, బహుజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం తన ప్రాణం ఉన్నంతవరకు పోరాడుతానని ఆయన వాగ్దానం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, ప్రజలందరూ బీఎస్పీకి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆటోలో కల్తీ నూనె తరలింపు

**మొదటిపేజీ తరువాయి -** నింపిన వాడిన నూనెను టీఎస్07 యూహెచ్ 1643 నంబర్ గల ఆటోలో తరలి టస్తుండగా అటుగా వెళ్తున్న జర్న లిస్టులు అనుమానంతో వాహనాన్ని ఆపారు. డబ్బాల్లో ఉన్న నూనె పూర్తిగా వాడిపోయి నల్లగా మారినట్లు గుర్తించిన జర్నలిస్టులు వెంటనే అత్యవసర సహాయ నంబర్ 100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ నూనె ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ అక్రమ వ్యాపారం వెనుక ఉన్న ముఠా ఎవరు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వాడిన నూనెను శుద్ధి చేసినట్లు చూపించి తక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.




**అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం:**

కేసు నమోదు అనంతరం స్వాధీనం చేసుకున్న నూనె నమూనాలను పరిశీలించేందుకు ఉప్పల్ పరిధిలోని ఆహార భద్రత అధికారిని పోలీసులు సంప్రదించినట్లు తెలిసింది. అయితే సంబంధిత అధికారి "నేను సెలవులో ఉన్నాను" అంటూ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దీంతో కేసు విచారణలో ఆలస్యం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, నూనె నాణ్యత పరీక్ష కోసం మరోసారి ఫోన్ చేయగా తాను ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో (లైవ్‌లో) ఉన్నానని, ఇతర అధికారులను సంప్రదించాలని సూచించిన ఘటన కొసమెరుపుగా మారింది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యవసర అంశంలో బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇక జీహెచ్‌ఎంసి (మహానగర పాలక సంస్థ) అధికారులను కూడా పోలీస్ స్టేషన్‌కు రప్పించి సంయుక్తంగా విచారణ జరపాలని ఉప్పల్ ఎస్సై ప్రయత్నిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారుల రాక కోసం పోలీసులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం.

**ప్రజారోగ్యంపై ముప్పు:**

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వాడిన వంటనూనెను మళ్లీ వినియోగించడం వల్ల జీర్ణ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తక్కువ ధరకు అమ్మే ఆహార పదార్థాల ద్వారా ఈ నూనె ప్రజలకు చేరే అవకాశం ఉండటం మరింత ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

**కఠిన చర్యలపై డిమాండ్:**

నగరంలో కల్తీ ఆహార పదార్థాల దందాపై సంబంధిత శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హోటళ్లలో వాడిన నూనెను సురక్షితంగా నిర్వాహణ చేయాలనే నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో అధికారుల నిర్లక్ష్యం సహించరానిదని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం కేసు నమోదు చేసి పోలీసులు పూర్తి స్థాయి విచారణ కొనసాగిస్తున్నారు

# తెలంగాణ అమర్‌నాథ్ యాత్రకు వేళాయే

**లింగమయ్యను దర్శించుకునేందుకు తరలివస్తున్న భక్తులు**

**తెలంగాణ అమరనాథ్ యాత్రగా పేరుగాంచిన సలేశ్వరం జాతర ప్రారంభం**

**ఏటా మూడు రోజులపాటు సలేశ్వరం జాతరను ఘనంగా నిర్వహణ**

**భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం**

తెలంగాణ అమరనాథ్ యాత్రగా పేరుగాంచిన సలేశ్వరం జాతర ప్రారంభమైంది. చైత్ర శుద్ధ పౌర్ణమి నుంచి ఏటా మూడు రోజులపాటు సలేశ్వరం జాతరను ఘనంగా నిర్వహిస్తారు. చెంచుల ఆరాధ్యదైవమైన లింగమయ్యను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలు సహా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తున్నారు. దట్టమైన అమ్రాబాద్ పులల అభయారణ్యంలో ఎత్తైన కొండల నుంచి జాలువారే అందమైన జలపాతానికి దిగువన వెలసిన లింగమయ్యను దర్శించుకుని తరిస్తారు. ఏటా కేవలం మూడు రోజులు మాత్రమే జరిగే జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది.

**చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా 3 రోజుల జాతర :**

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం అమ్రాబాద్ పులల అభయారణ్యంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఎత్తైన కొండల నడుమ, అందంగా జాలువారే జలపాతాల దిగువన వెలసిన చెంచుల ఆరాధ్య దైవం లింగమయ్య జాతర ప్రారంభమైంది. ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా కేవలం మూడు రోజులు మాత్రమే సలేశ్వరం జాతర జరుగుతుంది. నాలుగైదు కిలోమీటర్ల మేర కొండలు, ఎక్కిదిగి కాలినడకన స్వామివారి దర్శనం చేసుకోవడం ఈ జాతర ప్రత్యేకత. ఏటా ఈ జాతరకు తెలంగాణ, ఆంధ్రా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తుంటారు. కేవలం మూడు రోజులు మాత్రమే స్వామివారి దర్శనార్థం అటవీశాఖ భక్తులను అనుమతి ఇస్తుంటారు.

**జాతరకు ఎలా వెళ్లాలంటే? :**

సలేశ్వరం జాతరకు రావాలనుకునే భక్తులు ముందుగా నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరుకు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఫర్హాబాద్ చేరుకుని పులుల అభయారణ్యంలోకి ప్రవేశించాలి. సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే రాంపూర్ పెంట వస్తుంది. వాహనాలు అక్కడి వరకే అనుమతిస్తారు. ఆర్టీసీ బస్సులు సైతం అక్కడి వరకే వెళ్తాయి. అక్కన్నుంచి మరో ఒకటిన్నర కిలోమీటర్లు ఆటోల్లో సలేశ్వరానికి చేరుకోవచ్చు. తరువాత సుమారు నాలుగు కిలోమీటర్ల మేరు కాలినడక, దట్టమైన అటవీ ప్రాంతంలో కొండలు ఎక్కి, దిగితూ ఎత్తైన జలపాతం దిగువకు చేరుకోవాలి. అక్కడే కొండల నడుమ వెలసిన స్వామివారిని చేరుకుని దర్శించుకుని తిరుగు పయనమవ్వాలి.



**జాతర కోసం ప్రత్యేక ఏర్పాట్లు :**

అడవికి, వన్యప్రాణులకు ఎటువంటి నష్టం కలగనిరీతిలో అధికారులు జాతర కోసం ఏర్పాట్లు చేశారు. వాహనాలు వెళ్లే వరకు రహదారుల్ని మరమ్మతు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం చిన్నచిన్న బైపాస్‌లు సిద్ధం చేశారు. వాహనాల, భక్తుల రద్దీని డ్రోన్ల సాయంతో తెలుసుకోనున్నారు. బందోబస్తు కోసం 300 మందికి పైగా పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారు. భక్తుల వైద్య సేవలకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నేతృత్వంలో అప్పాయిపల్లె, రాంపూర్ పెంట, సలేశ్వరం లోయలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లా ఉప వైద్యాధికారి పర్యవేక్షణలో 3 రోజులు 24 గంటల పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.

**భక్తుల అంచనా మేర ఏర్పాట్లు సిద్ధం :**

అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించేందుకు రాంపూర్‌పెంట, పుల్లాయిపల్లె, ఫర్హాబాద్ చౌరస్తాలో అంబులెన్సులను సిద్ధం చేశారు. గతేడాది 3 లక్షల వరకు భక్తులు లింగమయ్య స్వామిని దర్శించుకున్నారు. ఈసారి అదే సంఖ్యలో భక్తులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఫర్హాబాద్ చౌరస్తా, పుల్లాయిపల్లె, రాంపూర్ పెంటలో అన్నదాన శిబిరాలు, చెప్పులకుర్వ వద్ద నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు.జాతరలో పాల్గొనే భక్తులు అటవీ ప్రాంతాన్ని కలుషితం చేయొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్లాస్టిక్ బాటిల్స్, చిప్స్ ప్యాకెట్లు, పాలిథిన్ కవర్లు తీసుకురావద్దని కోరుతున్నారు. ఒక వేళ తీసుకువస్తే వాటిని మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పాయింట్లలో వదిలేయాలని సూచిస్తున్నారు. అన్నదానం చేసే భక్తులు స్టీల్ పాత్రలు, పింగాణీ ప్లేట్లు, ఆకులతో తయారు చేసిన ప్లేట్లు మాత్రమే ఉపయోగించాలని కోరారు.

# మరో 2-3 వారాల్లో ఇరాన్ యుద్ధం ముగుస్తుంది : ట్రంప్

**ఇరాన్ యుద్ధంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

**మరో రెండు నుంచి మూడు వారాల్లో**

**యుద్ధం ముగిసే అవకాశం ఉందని**

ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. మరో రెండు నుంచి మూడు వారాల్లో ముగిసే అవకాశముందని తెలిపారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, త్వరగా ఒప్పందం కుదిరే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.'ఇరాన్ ఒప్పందం చేసుకోవాలనుకుంటోంది. మనకంటే వాళ్లకే ఎక్కువ ఆసక్తి ఉంది. త్వరలోనే ఈ యుద్ధం ముగుస్తుంది. ఇరాన్లో ప్రస్తుత నాయకత్వం గతంతో పోలిస్తే మరింత సహకార దృక్పథంతో ఉంది' అని ట్రంప్ అన్నారు. అయితే అమెరికా దళాల ఉపసంహరణ అనేది ఇరాన్‌తో కుదిరే ఒప్పందంపై ఆధారపడి లేదని ఆయన తేల్చి చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయలేని స్థితికి చేరుకుందని అన్నారు. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం ముగిసిన వెంటనే అమెరికాలో పెట్రోలు ధరలు భారీగా తగ్గుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ నుంచి బయటకు వస్తే చాలు ధరలు ఒక్కసారిగా పడిపోతాయని తెలిపారు.



**ఇరాన్ పునర్నిర్మాణానికి 15-20 ఏళ్లు : ట్రంప్**

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులతో ఆ దేశ సైనిక సామర్థ్యం తీవ్రంగా దెబ్బతిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ సైన్యం దాదాపు పూర్తిగా నిర్వీర్యమైందని అన్నారు. నౌకాదళం, వైమానిక దళం, రక్షణ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ దాడుల ప్రభావం నుంచి కోలుకోవడానికి ఇరాన్‌కు 15 నుంచి 20 సంవత్సరాలు పట్టొచ్చని ఆయన తెలిపారు.

**'లక్ష్యలను పూర్తిగా సాధించాం'**

ఈ యుద్ధంలో ప్రధాన లక్ష్యం ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా అడ్డుకోవడమేనని ట్రంప్ తెలిపారు. ఆ లక్ష్యం పూర్తిగా సాధించామని, ప్రస్తుతం ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేవని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు లక్ష్యం కాదని ట్రంప్ చెప్పినా, యుద్ధం వల్ల అక్కడి నాయకత్వ వ్యవస్థలో మార్పులు జరిగాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. వారికి సరైన నాయకులు కూడా లేరని తెలిపారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ నాయకత్వం తొందరపడుతోందని ట్రంప్ తెలిపారు. గత ఇరాన్ పాలకుల కంటే ఇప్పుడు ఉన్నవారు చాలా వాస్తవిక దృక్పథం ఉన్నవారని, హేతుబద్ధంగా ఆలోచిస్తున్నారని వివరించారు. అందుకే వారితో చర్చలు సఫలమై ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని తెలిపారు. వారు చర్చలకు వస్తే అంతా సరిగ్గా ఉంటుందని, కానీ వారు రాకపోయినా పర్వాలేదని అన్నారు.

**భూతల దాడలకు సిద్ధంగా ఉన్నాం : ఇరాన్**

అటు ఇరాన్ మాత్రం అమెరికాకు తలొగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెబుతోంది. చర్చల ద్వారా పరిష్కారం సాధ్యమనే నమ్మకం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. గతంలో జరిగిన ఒప్పందాలను అమెరికా ఉల్లంఘించిందని ఆయన విమర్శించారు. అమెరికా భూతల దాడులకు దిగితే అది వారు చేసే అతిపెద్ద తప్పిదం అవుతుందని హెచ్చరించారు. ఇరాన్ సైన్యం పూర్తిగా సిద్ధంగా ఉందని, భూతల దాడికి కూడా తాము సిద్ధమేనని పేర్కొన్నారు.

**హర్మూజ్ జలసంధిపై భిన్న అభిప్రాయాలు**

హర్మూజ్ జలసంధి భద్రత విషయంలో కూడా ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. అమెరికా ఇకపై ఆ ప్రాంత భద్రత బాధ్యత తీసుకోదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇతర దేశాలే తమ అవసరాల కోసం ఆ మార్గాన్ని రక్షించుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఇరాన్ మాత్రం యుద్ధంలో ఉన్న దేశాలకు మాత్రమే హోర్ముజ్ జలసంధిని మూసివేసినట్లు తెలిపింది. తమ మిత్ర దేశాల నౌకలకు సురక్షిత ప్రయాణం కల్పిస్తున్నామని వెల్లడించింది.ఇదిలా ఉండగా అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి అధ్యక్షుడు ట్రంప్ జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు వైట్‌హౌస్ పేర్కొంది. అందులో ఇరాన్‌కు సంబంధించి ట్రంప్ ఓ ముఖ్యమైన ప్రకటన చేయనున్నట్లు తెలిపింది. ఒకవైపు ఇరాన్ సైనిక శక్తి తీవ్రంగా దెబ్బతిన్నదని అమెరికా చెబుతుండగా, మరోవైపు యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా, యుద్ధం ముగింపు సమీపిస్తుందనే అంచనాలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఇంధన ధరల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది.

# ఏసీబీ వలలో చిక్కిన చైతన్యపురి ఏఎస్సై -రూ.15 వేల లంచం డిమాండ్




**హైదరాబాద్, క్రైమ్ , ఏప్రిల్ 1 (వార్త సంధ్య):** మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై బాలయ్య అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. మహిళా వేధింపుల కేసును లోక్ అదాలత్ ద్వారా ముగించేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసి, స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల ప్రకారం, చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెం. 363/2025లో పల్లపు రాంబాబు పై మహిళా వేధింపుల కేసు నమోదు అయింది. అనంతరం ఈ కేసు కాంప్రమైజ్ అయిన నేపథ్యంలో దాన్ని రంగారెడ్డి జిల్లా కోర్టులో లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించేందుకు ఏఎస్సై బాలయ్య రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.ఈ విషయంపై బాధితుడు పల్లపు రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అధికారులు ముందస్తుగా ట్రాప్ ఏర్పాటు చేశారు.కోర్టు ప్రాంగణంలోనే లంచం తీసుకుంటుండగా ఏఎస్సై బాలయ్యను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఈ ఘటనతో పోలీసు విభాగంలో మరోసారి అవినీతి అంశం వెలుగులోకి వచ్చింది.

# తెలంగాణలో చికెన్ షాప్‌ల బంద్

**నాటుకోళ్లకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్**

**రాష్ట్రంలో ఇవాళ్టి నుంచి చికెన్ షాప్‌ల బంద్**

**మూత పడిన చికెన్ దుకాణాలు**

**వ్యాపారుల్లో భిన్నాభిప్రాయాలతో పలుచోట్ల స్వల్ప ఘర్షణలు**

చికెన్ విక్రయదారులు బంద్ చేపట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా మాంసం దుకాణాలు మూతపడ్డాయి. కంపెనీలు కమీషన్లు భారీగా తగ్గించడాన్ని నిరసిస్తూ తెలంగాణ చికెన్ సెంటర్ల అసోసియేషన్ ఈ బంద్‌కు పిలుపునిచ్చింది. అయితే వ్యాపారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ పిలుపుతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చికెన్ షాపులు మూతపడ్డాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో షాపులు యథావిధిగా తెరుచుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు చికెన్‌షాపులు మూతపడటంతో నాటుకోళ్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది.

**పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తత :** ఎల్బీనగర్‌లో బంద్‌కు మద్దతుగా ఉన్న అసోసియేషన్ సభ్యులు షాపులు తెరిచిన యజమానులను అడ్డుకోవడంతో పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తత ఘటనలు చోటుచేసుకున్నాయి. కంపెనీలు మార్జిన్లు తగ్గించడం వల్ల చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని అసోసియేషన్ నేతలు ఆరోపిస్తున్నారు. అందరూ ఐక్యంగా పోరాడితేనే న్యాయం జరుగుతుందని వారు చెబుతున్నారు. అయితే రోజువారీ వ్యాపారం ఆగిపోతే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కొందరు షాపు యజమానులు చెబుతున్నారు. కొన్ని చోట్ల తోపులాటలు జరగడంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.ం

# ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లపై కెమెరా కన్ను

**కునుకు తీసినా, ఆవలించినా పట్టేస్తుంది**

**ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లపై కెమెరా నిఘా**

**బస్సుల్లో ఏఐ డ్రివెన్ డ్యాష్‌క్యామ్‌లు**

**రవాణా శాఖ కమిషనరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు**




ఇటీవల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. వీటిని నియంత్రించడానికి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డ్రివెన్ డ్యాష్‌క్యామ్‌లను బస్సుల్లో ఏర్పాటు చేయించింది. వీటిని వినియోగించడం ద్వారా డ్రైవర్‌ల ప్రవర్తనలో ఎటువంటి తేడాలు ఉన్నా వెంటనే అతడ్ని అప్రమత్తం చేసేందుకు అధునాతన వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. బస్సుల్లో అమర్చిన డ్యాష్‌క్యామ్‌ల ద్వారా రికార్డు అవుతున్న వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలస్తూ అప్రమత్తం చేసేందుకు రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది రాష్ట్ర రవాణా శాఖ.నేడు పన్ను తగ్గింపుపై సమావేశం: ఇప్పటి వరకు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం కడుతున్న పన్నుల వివరాలు తెలుసుకుని వాటి తగ్గింపుపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నేడు (బుధవారం) ట్రావెల్స్ యాజమాన్యంతో సమావేశంలో పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3 నెలల కాలానికి గానూ సీటుకు రూ.4 వేల చొప్పున పన్ను ఉండటంతో చాలా వరకు యాజమాన్యాలు ట్రావెల్స్ బస్సులను నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రాష్ట్రంలో, తెలుగు రాష్ట్రాల పరిధిలో వారి బస్సులను నడుపుతున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.త్రైమాసికానికి గానూ సీటుకు రూ. 4000 చెప్పున వసూలు చేస్తున్న ఈ పన్నును రూ.1,500 తగ్గించి రూ.2,500 చేయాలని ప్రభుత్వం భావిస్తోన్నట్లు సమాచారం. సమావేశాలు పూర్తయ్యి పన్ను తగ్గింపులు అమలులోకి వచ్చిన తర్వాత ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న బస్సులు తిరిగి ఏపీకి తీసుకొచ్చి రీ-రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరనున్నట్లు రవాణాశాఖ అధికారులు కోరనున్నారు.ఏమరపాటుగా ఉంటే అలర్ట్ ఇస్తుంది: డ్యాష్‌క్యామ్‌లు పని చేస్తాయిలా: ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఏఐ డ్రివెన్ డ్యాష్‌క్యామ్‌లను బస్సుల్లో ముందు రోడ్డు వైపు, డ్రైవర్ వద్ద, డోర్ వద్ద, ప్రయాణికుల వైపు ఏర్పాటు చేశారు. అన్ని వీడియోలనూ రికార్డ్‌చేస్తూ 5 సెకన్లకు ఓసారి కమాండ్ కంట్రోల్ రూంకు ఫీడ్‌ను చేరవేస్తుంది. బస్సు డ్రైవర్ ఆవలిస్తున్నట్లు గానీ, కళ్లు మూతపడుతున్నట్లు గానీ గుర్తిస్తే, ఒకవేళ బస్సు నడుపుతున్నప్పుడు డ్రైవర్ ఫోను మాట్లాడుతున్నా, సిగరెట్ తాగుతున్నా అది వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు, డ్రైవర్‌కు, బస్ యజమానికి అలెర్ట్‌లు పంపుతుంది.

**ఆటోమేటిక్‌గా జరిమానా:** నిర్దేశిత స్పీడ్ లిమిట్ పాటించపోయినా, మితిమీరిన వేగంతో ప్రయాణించినా అప్రమత్తం చేయడంతోపాటు, ఆటోమేటిక్‌గా ఫైన్ వేస్తూ, చలానా జారీ చేస్తుంది. ముందువైపు కెమెరాలో రోడ్డు మార్జిన్స్, ముందు ఎన్ని వాహనాలు వెళ్తున్నాయి. వంటి వివరాలు నమోదవుతాయి. ఒకవేళ ప్రమాదం సంభవిస్తే తప్పు ఎవరిదో సులువుగా తెలిసిపోతుంది. ఈ వ్యవస్థ ఏర్పాటు చెయ్యడానికి ఒక్కోబస్‌కు రూ.12 వేలు ఖర్చు చెయ్యాల్సి ఉంటుంది. నెలకు రూ.750లతో దీని నిర్వహణ ఉంటుంది. అన్ని బస్సుల్లోనూ వీటిని ఏర్పాటు చేసేందుకు ఫ్లీట్‌ఎక్స్ ఆపరేటర్, ఎయిర్‌ఫీ సంస్థలు ముందుకు రావడంతో రవాణాశాఖ వారితో చర్చించింది. నిన్నటికి (మంగళవారం) నాటికి 391 బస్సుల్లో డ్యాష్‌క్యామ్‌లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో తిరిగే 2 వేల ట్రావెల్స్ బస్సుల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. వ్యయాన్ని భరించేందుకు యజమానులు ముందుకొచ్చారని చెప్పారు.



RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య



## వేసవిలో చేతులపై టాన్ పేరుకుండా.. రంగుని మెరుగుపరిచేందుకు ఈ సింపుల్ టిప్స్ ట్రై చేయండి..



వేసవిలో ముఖాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ఎంత ముఖ్యమో, చేతులను జాగ్రత్తగా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. అటువంటి పరిస్థితిలో చేతులపై టాన్ ను తొలగించడానికి ఇంట్లో ఉన్న కొన్ని వస్తువులను ఉపయోగించవచ్చు. ఇది చేతుల రంగును పెంచడమే కాదు వాటికి సహజమైన మెరుపును కూడా ఇస్తుంది. కనుక ఇంట్లోనే ఏ వస్తువులతో టాన్ రిమూవల్ మాస్క్ తయారు చేసుకోవచ్చో ఈ రోజు తెలుసుకుందాం.. వేసవి కాలం చాలా సమస్యలను తెస్తుంది. ముఖ్యంగా చర్మ సంరక్షణ విషయానికి వస్తే తీవ్రమైన సూర్యకాంతి, వేడి గాలుల కారణంగా చర్మం టాన్ అవ్వడం సర్వసాధారణం. దీంతో ముఖ సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపించే మనం.. చేతుల విషయంలో కేరింగ్ ను విస్మరిస్తాము. అయితే చేతులకు కూడా జాగ్రత్త అవసరం. ప్రత్యక్షంగా సూర్య కిరణాలు తాకడం వలన చేతుల రంగును మారుస్తాయి. అవి పొడిగా, ముదురు రంగులో కనిపిస్తాయి. టానింగ్ తొలగించడానికి మార్కెట్లో అనేక ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అయితే కొన్నిసార్లు అవి ఖరీదైనవి, కొన్నిసార్లు రసాయనాల కారణంగా ప్రజలు వాటిని ఉపయోగించడానికి ఇష్టపడరు. అటువంటి పరిస్థితిలో సురక్షితమైన, సులభమైన పరిష్కారం వంటింటి చిట్కాలు. ఇంట్లో దొరికే పదార్థాలతో తయారుచేసిన మాస్కులు టానింగ్‌ను తగ్గించడమే కాదు చర్మానికి పోషణనిచ్చి, స్కిన్ కు సహజ మెరుపును తిరిగి ఇస్తాయి. కనుక వేసవిలో టానింగ్ వల్ల ప్రభావితమైన చేతుల రంగును మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని సులభమైన, ప్రభావవంతమైన ఇంట్లో తయారుచేసే మాస్కుల గురించి ఈ రోజు తెలుసుకుందాం.. శనగపిండి, పసుపు, పెరుగు మాస్క్ వేసవిలో చేతులపై వచ్చే టానింగ్‌ను తొలగించడానికి శనగపిండి మాస్క్ ఒక అద్భుతమైన నివారణ. దీని కోసం 2 చెంచాల శనగపిండి, 1 చిటికెడు పసుపు , 1 చెంచా పెరుగు కలిపి పేస్ట్ తయారు చేసుకోవాలి. దీని తర్వాత దానికి కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. ఈ మిశ్రమాన్ని చేతులకు రాసుకుని 20 నిమిషాల తర్వాత చేతులు కడుక్కోవాలి. ఈ మాస్క్ ట్యానింగ్‌ను తొలగించడమే కాదు చర్మాన్ని తేమగా కూడా ఉంచుతుంది.

## కంటి నిండా నిద్ర పట్టట్లేదా..? ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసా..?



నిద్రలేమి సమస్య ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తోంది. సరిపడా నిద్ర లేకపోతే ఆరోగ్యంపై చాలా చెడు ప్రభావాలు పడతాయి. ఈ నిద్రలేమికి ప్రధాన కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకుని, ఒకే సమయానికి లేవడం శరీరానికి చాలా మంచిది. కానీ ఈ సమయాలను తరచూ మార్చడం వల్ల శరీరం గందరగోళానికి గురై నిద్ర పట్టకపోవచ్చు. అందుకే ఒకే సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి. చాలా మంది పడుకునే ముందు ఫోన్ ను ఎక్కువగా చూస్తుంటారు. ఇది మెదడును నిద్ర మోడ్ లోకి వెళ్లనివ్వదు. మొబైల్ స్క్రీన్ నుండి వచ్చే నీలి రంగు కాంతి నిద్రకు సహాయపడే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుంది. కాబట్టి పడుకునే ముందు కనీసం ఒక గంట పాటు మొబైల్ కు దూరంగా ఉండటం మంచిది. రాత్రిపూట కాఫీ, టీ వంటి కెఫిన్ ఉన్న డ్రింక్ లు తాగడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. కెఫిన్ మెదడును చురుకుగా ఉంచి నిద్రను దూరం చేస్తుంది. అందుకే సాయంత్రం తర్వాత ఈ డ్రింక్ లను తగ్గించుకోవడం మంచిది. రాత్రి సమయంలో ఎక్కువగా తింటే అజీర్తి సమస్యలు వస్తాయి. ఇది నిద్రకు భంగం కలిగిస్తుంది. నిద్రపోవడానికి కనీసం రెండు గంటల ముందు తేలికపాటి భోజనం చేయడం ఉత్తమం. రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. వ్యాయామం ఒత్తిడిని తగ్గించి మంచి నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. వాకింగ్, యోగా, స్విమ్మింగ్ వంటివి మనసుకు, శరీరానికి విశ్రాంతినిస్తాయి. పగటిపూట ఎక్కువ గంటలు నిద్రపోతే రాత్రిపూట నిద్ర పట్టదు. మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకుంటే, 15 నుండి 20 నిమిషాలకు మించి నిద్రపోవద్దు. సాయంత్రం 3 గంటల తర్వాత పడుకోవడం మంచిది కాదు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో పని ఒత్తిడి, వ్యక్తిగత ఒత్తిడి నిద్రను దెబ్బతీస్తున్నాయి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి మెదడుకు విశ్రాంతినిచ్చే పనులు చేయాలి. ధ్యానం, యోగా, పాటలు వినడం, పుస్తకాలు చదవడం వంటివి మనసుకు ప్రశాంతతను ఇస్తాయి. నిద్రపోయే గది చాలా చల్లగా గానీ, చాలా వేడిగా గానీ ఉండకూడదు. గాలి బాగా వచ్చేలా చూసుకోవాలి. అలాగే పడుకునే మంచం కూడా సౌకర్యవంతంగా ఉండాలి. ఇవి నిద్రకు ఆటంకం లేకుండా చేస్తాయి. మద్యం సేవించడం, పొగ త్రాగడం, జంక్ ఫుడ్ తినడం వంటి అలవాట్లు నిద్రను దెబ్బతీస్తాయి. వీటిని తగ్గించి తాజా పండ్లు, కూరగాయలు, తేలికపాటి రాత్రి భోజనం వంటి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం వల్ల నిద్ర మెరుగుపడుతుంది. నిద్రలేమిని చిన్న సమస్యగా తీసిపారేయకూడదు. ఇది ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ఈ చిన్న చిన్న కారణాలను గుర్తించి వాటిని సరిచేసుకుంటే మళ్లీ చక్కటి నిద్రను పొందవచ్చు.

## మీ శరీరానికి కావాల్సిన పోషకాలు వీటిలో ఫుల్ ఉంటాయి..! తినడం అస్సలు మిస్సవ్వొద్దు..!



బాదంలో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. వీటిని రాత్రి నానబెట్టి ఉదయం తినడం వల్ల ఆరోగ్యానికి అనేక రకాల లాభాలు కలుగుతాయి. జీర్ణం, గుండె ఆరోగ్యం, మెదడు పనితీరు, బరువు నియంత్రణ, నిద్ర సమస్యలు వంటి వాటికి బాదం ఎంతో సహాయపడుతుంది. బాదం గింజలు ఆరోగ్యానికి చాలా మంచివి. అయితే వీటిని నానబెట్టి తింటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున తింటే శరీరానికి ఎన్నో పోషకాలు అందుతాయి. రోజూ ఇలా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుంది. రాత్రి పడుకునే ముందు బాదం గింజలను నీటిలో నానబెట్టాలి. ఉదయం వాటిని నీటిలోంచి తీసి వాటిపై ఉన్న పొట్టును తీసేసి తినాలి. ఇలా తింటే బాదంలో ఉన్న పోషకాలు శరీరానికి సులభంగా అందుతాయి. నానబెట్టిన బాదంలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. మలబద్ధకం, అజీర్ణం వంటి వాటి నుంచి ఉపశమనం కలిగించి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి బాదం మంచి ఆప్షన్. ఇందులో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు ఆకలిని నియంత్రించి ఎక్కువగా తినకుండా ఆపుతాయి. తక్కువ కేలరీలు ఉన్నా ఎక్కువ పోషణను అందించే బాదం శరీరాన్ని ఉత్సాహంగా ఉంచుతుంది. బాదంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెను కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతాయి. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున బాదం తినడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. బాదంలో ఉండే విటమిన్ ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు కణాల ఎదుగుదలకు సహాయపడతాయి. విద్యార్థులు తరచుగా దీన్ని తీసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. బాదంలో ఉండే మెగ్నీషియం అనే ఖనిజం నరాలను ప్రశాంతంగా ఉంచి మంచి నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. నిద్రలేమితో బాధపడే వారు దీన్ని తినడం వల్ల నిద్రలో మార్పును గమనించవచ్చు. రోజూ కొన్ని బాదం లను నానబెట్టి తినే అలవాటు చేసుకోవడం వల్ల ఎన్నో శారీరక, మానసిక ప్రయోజనాలు పొందవచ్చు.

## కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఉత్తమ వ్యాయామాల గురించి మీకు తెలుసా..?

వేయించిన ఆహారాలు, ఒత్తిడి క్రమంగా కాలేయాన్ని బలహీనపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. మందుల సహాయం తీసుకునే ముందు కాలేయాన్ని లోపలి నుండి బలోపేతం చేసే కొన్ని వ్యాయామాల గురించి తెలుసుకుందాం. మీ కాలేయం సంవత్సరాల తరబడి ఫిట్‌గా, చురుగ్గా ఉండాలని మీరు కోరుకుంటే, ఉత్తమ.. శరీరంలోని ప్రతి భాగం చాలా ముఖ్యమైనది. కానీ ఈ యంత్రం ఇంజిన్ బలహీనంగా మారితే ఏం జరుగుతుంది? మన శరీరంలో కాలేయం ఎంతో ముఖ్యమైది. ఇది శరీరంలోని అతి ముఖ్యమైన, కష్టపడి పనిచేసే అవయవాలలో ఒకటి. కాలేయం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడటమే కాకుండా శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడానికి కూడా పనిచేస్తుంది.



**కపాలభాతి ప్రాణాయామం**

ఇది కాలేయానికి అత్యంత ప్రభావవంతమైన యోగా ఆసనం అని భావిస్తారు. ఈ ప్రాణాయామంలో వేగంగా గాలి వదులుతూ కడుపు లోపలికి, బయటకు కదిలిస్తూ ఉంటుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. రోజూ 5-10 నిమిషాలు కపలాభతి చేయడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కపలాభతి అనేది ఒక శక్తివంతమైన ప్రాణాయామం, దీనిలో శ్వాసను వదులుతున్నప్పుడు ఉదర కండరాలు వేగంగా సంకోచిస్తూ సడలిస్తుంటాయి. ఇది కేవలం శ్వాస ప్రక్రియ మాత్రమే కాదు, ఒక రకమైన డీటాక్స్ కూడా.

**కాలేయానికి ఎలా ఉపయోగపడుతుంది?**

కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది: కపలాభతి కడుపులోని అంతర్గత అవయవాలను సక్రియం చేస్తుంది. ఇది కాలేయంపై పేరుకుపోయిన కొవ్వును తగ్గిస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది: ఈ ప్రాణాయామం కాలేయం వైపు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. కణాలు ఎక్కువ ఆక్సిజన్‌ను అందించడానికి, మెరుగ్గా పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. డీటాక్స్‌లో సహాయపడుతుంది: కపలాభతి శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగిస్తుంది. కాలేయం పనిని సులభతరం చేస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది: మానసిక ఒత్తిడి కాలేయ ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. కపలాభతి మనస్సును ప్రశాంతపరుస్తుంది. మరియు హార్మోన్లను సమతుల్యంగా ఉంచుతుంది. మీ కాలేయం ఆరోగ్యంగా ఉండాలని, జీవితాంతం వ్యాధులకు దూరంగా ఉండాలని మీరు కోరుకుంటే, ప్రతి ఉదయం కేవలం 10 నిమిషాలు కపలాభతి ప్రాణాయామం చేయడం అలవాటు చేసుకోండి. యోగ ఒక బహుమతి లాంటిది. ఇది ఎటువంటి ఖర్చు లేకుండా మిమ్మల్ని అంతర్గతంగా ఆరోగ్యంగా చేస్తుంది.

## రాత్రి పూట వెల్లుల్లి తింటే ఆరోగ్యానికి ఎన్ని లాభాలో తెలుసా..?




వెల్లుల్లి ఒక అద్భుతమైన ఔషధ గుణాలు కలిగిన పదార్థం. రాత్రి పడుకునే ముందు పచ్చి వెల్లుల్లిని తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది ఒత్తిడిని తగ్గించడంతో పాటు నిద్రను మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యం, షుగర్, కొలెస్ట్రాల్, బరువు నియంత్రణలోనూ సహాయపడుతుంది. వెల్లుల్లిని రాత్రి పడుకునే ముందు తింటే మన శరీరానికి ఎన్నో లాభాలు కలుగుతాయి. వెల్లుల్లిలో ఉండే సహజ గుణాలు శరీరాన్ని శుభ్రం చేసి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. పచ్చి వెల్లుల్లి మన శరీరాన్ని, మనసును రిలాక్స్ చేస్తుంది. ఒత్తిడిని తగ్గించి నిద్ర సమస్యలను దూరం చేస్తుంది. మెదడు నాడీ వ్యవస్థపై మంచి ప్రభావం చూపి గాఢమైన నిద్ర పట్టేలా చేస్తుంది. నిద్రలేమితో బాధపడే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. వెల్లుల్లి శరీరంలోని గ్లూకోజ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. షుగర్ ఉన్నవారికి ఇది సహజ ఔషధంలా పని చేస్తుంది. రోజూ తగిన మోతాదులో తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పచ్చి వెల్లుల్లి తినడం వల్ల అధిక కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి శరీరానికి అవసరమైన మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. దీనివల్ల గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది. వెల్లుల్లిలో యాంటీబాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీఫంగల్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని రోగాల నుంచి కాపాడతాయి. తరచుగా జలుబు, దగ్గు, జ్వరం వచ్చే వారికి ఇది ఒక రక్షణ కవచంలా పని చేస్తుంది. పచ్చి వెల్లుల్లి శరీరంలోని కొవ్వును వేగంగా కరిగించడానికి సహాయపడుతుంది. ఇది మెటబాలిజంను పెంచి బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది. ఆకలిని నియంత్రించడం వల్ల ఎక్కువగా తినే అలవాటు తగ్గుతుంది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల మన ఆరోగ్యానికి ఎన్నో లాభాలు కలుగుతాయి. ఇది పూర్తిగా సహజమైన పద్ధతి. అయితే ఏవైనా అనూహ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణుల సలహా తీసుకోవాలి.

## జామకాయ అనుకునేరు.. కానేకాదు! ఇదోక ప్రకృతి వరం.. క్యాన్సర్, ఊబకాయంకి దివ్యౌషధం..

ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సోరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది.. ప్రతిరోజూ మనం వంట కోసం వివిధ రకాల కూరగాయలను ఉపయోగిస్తుంటాం.. అవి నాలుకకు రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంటాయి. అలాంటి కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సోరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది. మరి వీటిని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..





**గుండె ఆరోగ్యానికి సప్లిమెంట్**

సీమ వంకాయలలో ఫైటోకెమికల్స్ అధికంగా ఉంటాయి. ఇవి రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే మైరిసెటిన్ కొలెస్ట్రాల్, వాపు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది.

**చర్మ క్యాన్సర్ నివారణకు దివ్యౌషధం**

సీమ వంకాయ లోప, బయటి తొక్కలో క్యాన్సర్‌ను నివారించగల యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది చర్మ క్యాన్సర్‌ను నివారించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది.

**హిందీ సప్లిమెంటరీ పరీక్షకు ఒకేఒక్కడు..**
**ఇన్విజిలేటర్లేమో ముగ్గురు!**

శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం

శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సీమ వంకాయ ఒక గొప్ప ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ రోగులు తినడానికి ఉత్తమమైన కూడా.

**లివర్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది**

సీమ వంకాయకు కాలేయంలో అనవసరమైన కొవ్వు పేరుకుపోకుండా నిరోధించే సామర్థ్యం ఉంది. గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇది మంచి ఆహారం. ఎందుకంటే దీనిలోని %దీ%9 ప్రోటీన్ పిండం అభివృద్ధికి, ముఖ్యంగా మెదడు, వెన్నుపాము అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది అకాల జనన అవకాశాలను తగ్గిస్తుంది. అధ్యయనాల ప్రకారం సీమ వంకాయలో లుకేమియా, గర్భాశయ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ కణాల పెరుగుదలను నెమ్మదింపజేసే ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వంకాయలోని యాంటీఆక్సిడెంట్లు మరియు పోషకాలు కణాల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. ఇది శరీరం యొక్క వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుందని అనేక అధ్యయనాలు చూపించాయి. అలాగే, ఈ వంకాయ వాపుకు దివ్యౌషధం. విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఈ కూరగాయ వర్షాకాలం, శీతాకాలంలో సాధారణంగా కనిపించే వివిధ బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి భలేగా సహాయపడుతుంది.

## ఇలాంటి గుణాలున్నావారు నిత్య అసంతృప్తి వాదులు వీరు సుఖంగా ఉండరు, ఎదుటివారు ఉంటే ఓర్వలేరు



మహాభారతంలోని ముఖ్యమైన పాత్రలలో ఒకరు విదురుడు. అంబిక దాసికి, వ్యాసుడికి జన్మించినవాడు విదురుడు. అతని తెలివితేటల కారణంగా ప్రజలు ఇప్పటికీ విదురుడిని గుర్తుంచుకుంటారు. విదురుడు తన జ్ఞానం, అనుభవం ద్వారా ధృతరాష్ట్రునికి చెప్పిన నీతులను విదుర నీతిగా ప్రసిద్ధిగంచాయి. వీటిని పాటించడం వల్ల జీవితం అత్యున్నత స్థాయిలో ఉంటుందని పండితులు చెబుతారు. అదే విధంగా మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే సరైన మార్గదర్శకత్వం అవసరం.. అని విదుర్ నీతిలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే ప్రతికూల ఆలోచనలు వదిలి సానుకూల ఆలోచనలు చేయాలి. మంది గొప్ప వ్యక్తుల జీవితాలు, ఆలోచనల నుంచి ప్రేరణ పొందవచ్చు. అలాంటి ఆలోచనలు జీవితంలో ముందుకు సాగడానికి ప్రతి ఒక్కరికీ సహాయపడతాయి. మహాభారతంలోని ముఖ్యమైన పాత్రలలో మహాత్మా విదురుడు ఒకరు. అతని తెలివితేటలు, జ్ఞానం, కృష్ణ భక్తీ వలన విదురుడిని నేటికీప్రజలు గుర్తుంచుకుంటారు. మహాత్మా విదురుడు చెప్పిన విధానాలను విదుర నీతి అంటారు. మహాత్మా విదురుడు ఎప్పుడూ అసంతృప్తిగా ఉండే వ్యక్తుల గురించి తన నీతి శాస్త్రంలో చెప్పాడు. వీరు ఎప్పుడు సంతోషంగా ఉండరు.. దుఃఖ పడుతూనే జీవితాన్ని గడిపెస్తారని అన్నారు. అసూయ విదుర నీతి ప్రకారం ఇతరుల పురోగతిని చూసి అసూయపడే వ్యక్తి తన జీవితంలో ఎప్పుడూ విచారంగా ఉంటాడు. ఈ రకమైన గుణం అంటే అసూయ గుణం వ్యక్తులకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉంటుంది. అసూయతో జీవించే వ్యక్తి అవతలి వ్యక్తిలో ప్రతికూలత ఆలోచనలను కూడా పెంచుతాడు. ద్వేషించే గుణం ద్వేషం లేదా అసహ్యం అనేది మిమ్మల్ని లోపలి నుంచి దహించి వేసే భావన . ఇతరుల పట్ల అకారణ ద్వేషం ఉన్న వ్యక్తి చివరికి ప్రతికూలత ను ఒంటరితనాన్ని ఎంచుకుంటాడు. అది తప్ప వీరికి మరేమీ మిగలదు. ఇతరులను ద్వేషించే వ్యక్తి తన దగ్గరి బంధువుల నుంచి కూడా దూరం అవుతాడు.

**గబ్బిలాల నుంచి వీటిని నేర్చుకుంటే.. జీవితంలో ఎప్పటికీ బాధపడరు.**

అసంతృప్తి జీవితంలో సంతోషంగా ఉండాలంటే ఉన్నదానితో సంతృప్తి చెందాలి. విదుర నీతి ప్రకారం తనకి ఉన్న దానితో సంతృప్తి చెందని వ్యక్తి ఎల్లప్పుడూ అసంతృప్తిగా ఉంటాడు. అలాంటి వారికి ఆనంద సాధనాలు ఉన్నప్పటికీ వారు ఎప్పుడూ సంతోషంగా ఉండరు.

**కోపం- అనుమానం**

కోపంగా ఉన్న వ్యక్తి జీవితంలో ఎప్పుడూ దుఃఖం ఉంటుందని మహాత్మా విదురుడు అన్నాడు. అధికంగా కోపం తెచ్చుకునే వ్యక్తి జీవితంలో సంబంధాలపై ప్రభావం చూపిస్తుంది. సంబంధాలను కూడా పాడు చేస్తుంది. ఇంకా విదుర నీతిలో ప్రతి చిన్న విషయాన్ని అనుమానించి, తన జీవితాన్ని నిత్యం సందేహంతో గడిపే వ్యక్తి జీవితం దుఃఖించదాంతోనే గడిచిపోతుందని చెప్పాడు. ఇతరులపై ఆధారపడి ఉండటం కష్టపడి పనిచేయడం ద్వారానే విజయం లభిస్తుంది. కష్టపడి పనిచేయడం మానేసి ఇతరులపై ఆధారపడే వ్యక్తికి సమాజంలో తగినంత గౌరవం లభించదు. అలాంటి వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉండడు.

# వార్ ఎఫెక్ట్- భారీగా పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర- ఎంతంటే?

**వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర పెంపు**

**వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై రూ.195 పెంపు ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 2,078**

పశ్చిమాసియా యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరల ప్రభావం భారత్‌పై పడుతోంది. వాణిజ్య వినియోగానికి సంబంధించిన 19 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరలను ప్రభుత్వ చమురు సంస్థలు భారీగా పెంచాయి. సిలిండర్‌పై రూ.195.50 మేర పెంచాయి. అయితే ఈ పెంచిన ధరలు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయి. అయితే గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు.

### హోటళ్లు, రెస్టారెంట్లపై ప్రభావం

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) వెబ్‌సైట్ ప్రకారం, ఢిల్లీలో 19 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.195.50 పెరిగి రూ.2,078.50కు చేరింది. కోల్‌కతాలో మరింతగా రూ.218 పెంపు నమోదైంది. గత మార్చి 1న కూడా వాణిజ్య సిలిండర్‌పై రూ.114.50 పెరిగింది. ఈ ధరల పెంపు ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పరిశ్రమలపై ప్రభావం చూపనుంది. వాణిజ్య రంగానికి చెందిన వ్యయాలు పెరగడంతో ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. ఇదే సమయంలో 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధర రూ.51 పెరిగి రూ.549కు చేరింది.

### గృహ వినియోగదారులకు ఉపశమనం

అయితే గృహ వినియోగదారులకు ప్రస్తుతం ఎలాంటి మార్పులు చేయలేదు. 14.2 కిలోల గృహ వంటగ్యాస్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.913గానే కొనసాగుతోంది. మార్చి 7న రూ.60 పెంపు తర్వాత ఇది స్థిరంగా ఉంది.

### పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథం

ఇక దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పు లేదు. ఢిల్లీలో పెట్రోల్ లీటరు రూ.94.72, డీజిల్ రూ.87.62 వద్ద కొనసాగుతున్నాయి. గత ఏడాది మార్చిలో తగ్గింపు తర్వాత ఇవి స్థిరంగా ఉన్నాయి.



### ఎల్‌పీజీ సిలిండర్ ధరలను ఎలా, ఎక్కడ చెక్ చేయవచ్చు?

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్, హిందూస్తాన్ పెట్రోలియంవంటి ప్రభుత్వ చమురు సంస్థలు ప్రతి నెల మొదటి తేదీన అంతర్జాతీయ మార్కెట్ ధరలు, కరెన్సీ మార్పిడి రేట్ల ఆధారంగా ధరలను సవరించాయి. ఎల్‌పీజీ సిలిండర్ అసలు ధరలను తెలుసుకోవాలనుకుంటే ఇండియన్ ఆయిల్ అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఇదే వెబ్‌సైట్‌లో ఎల్‌పీజీ ధరలతోపాటు, జెట్ ఫ్యూయెల్, ఆటో గ్యాస్, కిరోసిన్ మొదలైన ఇంధనాల ధరలను కూడా తెలుసుకోవచ్చు.

### భారీగా పెరిగా విమాన ఇంధనం-ఏటీఎఫ్ ధరలు

ఇదిలా ఉండగా బుధవారం నుంచి ప్రధాన మెట్రోల నగరాల్లో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను కూడా పెంచారు. ఢిల్లీ ఏటీఎఫ్ ధర ఇప్పుడు కిలోలీటరుకు రూ. 2,07,341.22గా ఉండగా, కోల్‌కతాలో ఇది కిలోలీటరుకు రూ. 2,05,953.33గా ఉంది. ముంబయిలో రూ. 1,94,968.67, చెన్నైలో కిలోలీటరుకు రూ. 2,14,597.66గా నమోదయ్యాయి. పెరుగుతున్న ప్రపంచ ముడి చమురు ధరలకు అనుగుణంగా ఈ పెరుగుదల ఉంది. దీంతో మొత్తం విమానయాన రంగంపై ప్రభావం చూపుతోంది.

### ప్రభుత్వం భరోసా

ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా ఇంధన సరఫరాలో ఎలాంటి లోటు లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకులు సాధారణంగా పనిచేస్తున్నాయని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. పెట్రోల్, డీజిల్ తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ప్రచారంలో ఉన్న వదంతులను నమ్మి కొనుగోళ్లు చేయొద్దని పౌరులకు సూచించింది.పశ్చిమాసియాలో యుద్ధం మొదలై నెలరోజులు దాటినా ఉద్రిక్తత పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయి. పరస్పర దాడులతో దద్దరిల్లుతోంది. ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్, అమెరికా కలిసి దాడులు చేస్తున్నాయి. మరోవైపు ఇరాన్ కూడా ఏ మాత్రం తగ్గడం లేదు. దాడులతో ప్రతిస్పందిస్తోంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వద్ద సరఫరా అంతరాయం వల్ల అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరిగాయి. దీని ప్రభావం ఎల్‌పీజీ ధరలపై పడింది.

# పతనం నుంచి కోలుకున్న మార్కెట్లు.. నేడు లాభాల పంట

**కొత్త త్రైమాసికంలో లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు**

**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో ప్రపంచ మార్కెట్ల ర్యాలీ**

**భారీగా పడిపోయిన ఇండియా విక్స్.. తగ్గిన అనిశ్చితి భయాలు**

**బ్యాంకుల వార్షిక ముగింపుతో నేడు రూపాయి మార్కెట్‌కు సెలవు**

**పసిడి, వెండి ధరలు పైకి.. పెరిగిన ప్రీమియం పెట్రోల్ ధరలు**



కొత్త ఆర్థిక త్రైమాసికం భారత స్టాక్ మార్కెట్లకు శుభారంభాన్ని ఇచ్చింది. గత నెలలో ఇరాన్ యుద్ధ భయాలతో భారీగా పతనమైన సూచీలు.. బుధవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే భారీ లాభాలతో దూసుకెళ్లాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,814 పాయింట్లు (2.52 శాతం) లాభపడి 73,762 వద్దకు చేరగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 567 పాయింట్లు (2.54 శాతం) పెరిగి 22,899 వద్ద ట్రేడ్ అవుతోంది.అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు మార్కెట్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. రెండు, మూడు వారాల్లో అమెరికా బలగాలు ఇరాన్‌ను వీడుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచ మార్కెట్లలో జోష్ నింపింది. ఈ ప్రభావంతో అమెరికా మార్కెట్లయిన ఎస్&పీ 500, డౌ జోన్స్ సూచీలు 2.5 శాతం నుంచి 2.9 శాతం వరకు పుంజుకోగా, నాస్‌డాక్ 3.8 శాతం లాభపడింది. ఇదే ఉత్సాహంతో ఆసియా మార్కెట్లైన జపాన్ నిక్కీ 4 శాతం, దక్షిణ కొరియా కోస్పి 6 శాతం మేర పెరిగాయి.దేశీయంగా చూస్తే, బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల సందడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 2.5 శాతం పైగా లాభపడ్డాయి. మార్కెట్‌లో భయాలను, అనిశ్చితిని సూచించే ఇండియా వోలటాలిటీ ఇండెక్స్ 15 శాతం పడిపోయి 23.65కు చేరడం ట్రేడర్లకు ఊరటనిచ్చింది.ఇదిలా ఉండగా, బ్యాంకుల వార్షిక ఖాతాల ముగింపు కారణంగా బుధవారం రూపాయి మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుతాయనే అంచనాలతో బంగారం, వెండి ధరలు సుమారు ఒక శాతం పెరిగాయి. మరోవైపు, ఢిల్లీలో ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దేశంలో మొత్తం రుణాలలో గోల్డ్ లోన్ల వాటా 36 శాతానికి చేరిందని, ముఖ్యంగా చిన్న పట్టణాలలో ఈ వృద్ధి కనిపిస్తోందని నివేదికలు చెబుతున్నాయి.

# దివాలా చట్టంలో 12 కీలక సవరణలు

**బాధితులకు మరింత మెరుగైన పరిరక్షణ: నిర్మలా సీతారామన్**

**దివాలా చట్టం సవరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**ఇక దివాలా పరిష్కారాలకు నిర్దిష్ట గడువులు**

**కోర్టు బయట పరిష్కారాన్ని వెతుక్కునే ఛాన్స్**

**దివాలాతీసిన వారు విదేశాల్లో ఉన్నా పరిష్కారాన్ని పొందేలా నిబంధనలు: నిర్మల**



2016లో అమల్లోకి వచ్చిన దివాలా చట్టం (ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్ట్సీ కోడ్ - ఐబీసీ)లో 12 సవరణలకు ఉద్దేశించిన బిల్లుకు సోమవారం లోక్‌సభలో ఆమోదం లభించింది. దివాలా ప్రక్రియను పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువులను నిర్దేశించొచ్చు అని నూతన సవరణలు చెబుతున్నాయి. దివాలా తీసిన వ్యక్తి లేదా కంపెనీ కోర్టు బయట పరిష్కారాన్ని వెతుక్కునే అవకాశం కూడా లభిస్తుంది. దివాలా తీసిన వ్యక్తి లేదా కంపెనీ భారత్ అవతల (విదేశాల్లో) ఉన్నా వివాదాన్ని పరిష్కరించుకునే మార్గాలను, విధి విధానాలను కొత్త సవరణలు సూచిస్తున్నాయి. దివాలా తీసిన వ్యక్తి లేదా కంపెనీ వల్ల బాధితులుగా మారిన వ్యక్తులు, వాటాదారులు, బ్యాంకులు, ఆర్థిక సంస్థల ప్రయోజనాలను మరింత మెరుగ్గా పరిరక్షించేందుకు ఈ సవరణలు దోహదం చేస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు చెప్పారు.

### దివాలా చట్టంలో సవరణలు చేయడం ఇది ఏడోసారి.

తాజా సవరణల ప్రకారం, ఆర్థిక సంక్షోభంలో ఉండే కంపెనీలు, వ్యక్తుల దివాలా వ్యవహారాలకు నిర్ణీత గడువులోగా పరిష్కారాలను చూపించాలి. ఈ ప్రక్రియలో జాప్యాన్ని పెంచేలా దాఖలయ్యే విచారకరమైన, పనికిమాలిన ఫిర్యాదులను అడ్డుకోవడానికి, అలాంటి వాటిపై రూ.1 లక్ష నుంచి రూ.2 కోట్ల దాకా జరిమానాలను విధించాలని నిర్ణయించారు.కంపెనీ లేదా వ్యక్తి దివాలా తీశారనే నిర్ధారణ జరిగిన 14 రోజుల్లోగా దరఖాస్తును సమర్పించాలని కొత్త సవరణ నిర్దేశిస్తోంది.నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ఎదుట దాఖలయ్యే దివాలా అప్పీల్ పిటిషన్‌ను 3 నెలల్లోగా పరిష్కరించాలి. దివాలా తీసిన కంపెనీకి కనీసం 51 శాతం రుణాలను ఇచ్చిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులు కలిసి ఎన్‌సీఎల్ఏటీ జోక్యం అవసరం లేకుండా నేరుగానే ఫాస్ట్‌ట్రాక్ దివాలా పరిష్కార ప్రక్రియను మొదలుపెట్టొచ్చు. దీనివల్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుంది.దివాలా తీసిన కంపెనీ నిర్వహణ బాధ్యతలను కోర్టు ద్వారా రుణదాతలు చేపట్టొచ్చు. కోర్టు అనుమతితో ఆ కంపెనీ రుణాల పునర్ వ్యవస్థీకరణ చేయొచ్చు. ఆస్తులను అమ్మొచ్చు. ఆ కంపెనీ నిర్ణయాలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నియామకాలను తమ చేతుల్లోకి రుణదాతలు తీసుకోవచ్చు.

### 150 రోజుల్లోగా కోర్టు బయట పరిష్కారం పొందొచ్చు

ఆచరణాత్మక సవాళ్లు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దివాలా చట్టంలో మరిన్ని సవరణలు చేశామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలిపారు. ఈ మార్పుల వల్ల దేశ బ్యాంకింగ్ రంగం ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని ఆమె చెప్పారు. ఈ సవరణ బిల్లుకు లోక్‌సభ సెలెక్ట్ కమిటీ చేసిన అన్ని సిఫారసులు ఆమోదాన్ని పొందాయని నిర్మల వెల్లడించారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచే ఉద్దేశంతో కార్పొరేట్ వ్యాపార గ్రూప్‌లతో, విదేశాల్లోని వ్యక్తులు, సంస్థలతో దివాలా వివాదాలను పరిష్కరించుకునే విధానాలనూ అందుబాటులోకి తెచ్చామన్నారు. దివాలా తీసిన వ్యక్తులు, సంస్థలు కోర్టు అవతలి వ్యవస్థల ద్వారానూ 150 రోజుల్లోగా పరిష్కారాలను పొందొచ్చని ఆమె తెలిపారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, డెబ్ట్ రికవరీ ట్రిబ్యునల్‌లు దివాలా పిటిషన్ దాఖలైన 30 రోజుల్లోగా దాన్ని ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాలనే నిబంధన కూడా నూతన సవరణల్లో ఉందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.


### ఉద్యోగుల బకాయిల చెల్లింపులకూ అధిక ప్రాధాన్యత

దివాలా పరిష్కారాలు లభించిన తర్వాత చాలా భారతీయ కంపెనీలు బాగానే రాణిస్తున్నాయని అధ్యయన నివేదికలను బట్టి తెలుస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. అలాంటి కంపెనీల మూలధన విలువ దివాలా పరిష్కారం లభించిన ఐదేళ్లలోనే రూ.2.8 లక్షల కోట్ల నుంచి రూ.9 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. దివాలా తీసిన కంపెనీల నుంచి వివిధ మార్గాల ద్వారా రూ.1,04,099 కోట్లను దేశంలోని వాణిజ్య బ్యాంకులు రికవర్ చేశాయని పేర్కొన్నారు. ఇందులో రూ.54,528 కోట్ల (52.3 శాతం) రికవరీ కేవలం దివాలా (ఐబీసీ) చట్టం ప్రకారమే జరిగిందన్నారు. దివాలా తీసిన కంపెనీల్లోని సిబ్బంది, ఉద్యోగుల బకాయిల చెల్లింపులకూ ఐబీసీ చట్టం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆమె తెలిపారు. పూచీకత్తు లేని రుణాలు, ప్రభుత్వ బకాయిల రికవరీ కంటే ఉద్యోగులకు కంపెనీ ఇవ్వాల్సిన బకాయిలకే ఐబీసీ చట్టం పెద్దపీట వేసిందన్నారు.

### లాకర్లలో ఏమున్నాయో బ్యాంకులు చూడవు : నిర్మల

లాకర్లలో కస్టమర్లు ఏమేం దాచుకున్నారో బ్యాంకులు చూడవని, ఆ వివరాలను నమోదు చేయవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. లాకర్లలో దాచుకున్న వస్తువులు, డాక్యుమెంట్లను బ్యాంకులు చూసినా, ఆ వివరాలను నమోదు చేసినా బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు అవుతుందన్నారు. అందువల్ల లాకర్లలోని వస్తువుల విలువ ఆధారంగా భిన్నమైన బీమా కవరేజీని నిర్ణయించడం అనేది సాధ్యపడదని ఆమె తేల్చి చెప్పారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో మహారాష్ట్రలోని గడ్చిరోలి - చిమూర్ కాంగ్రెస్ ఎంపీ నామ్‌దేవ్ దాసారామ్ కిర్సన్ అడిగిన ఒక ప్రశ్నకు ఈమేరకు నిర్మల బదులిచ్చారు. బ్యాంకు లాకర్‌లోని ఎంత విలువైన వస్తువు పోయినా, లాకర్ వార్షిక ఛార్జీకి 100 రెట్లు సమానమైన పరిహారమే లభిస్తుందని ఆమె చెప్పారు. లాకర్లలోని వస్తువుల విలువను బ్యాంకులు ఎన్నడూ గణన చేయవన్నారు.

# భారత్‌లో సగటు మొబైల్ డేటా వినియోగం ఎంతో తెలుసా?



భారతీయుల మొబైల్ డేటా వినియోగం అంచనాలకు మించి దూసుకుపోతోంది. 2025 నాటికి దేశంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వాడకం 31 జీబీ దాటింది. గత ఐదేళ్లలో ఇది ఏటా సగటున 18 శాతం చొప్పున వృద్ధి చెందింది. ప్రముఖ టెలికాం పరికరాల తయారీ సంస్థ నోకియా మంగళవారం విడుదల చేసిన 'మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్' నివేదికలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.దేశంలో 5జీ సేవలు వేగంగా విస్తరించడం, 4కే వీడియో స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్, ఏఐ ఆధారిత యాప్‌ల వాడకం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని నివేదిక స్పష్టం చేసింది. 2025 నాటికి భారతదేశంలో మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్ నెలకు 27 ఎక్సాబైట్లు దాటింది. ఇందులో దాదాపు 47 శాతం వాటా ఒక్క 5జీదే కావడం గమనార్హం. 5జీ డేటా ట్రాఫిక్ ఏకంగా 70 శాతం వృద్ధితో నెలకు 12.9 ఎక్సాబైట్లకు చేరుకుంది.ప్రస్తుతం మెట్రో నగరాలు 5జీ వినియోగంలో ముందున్నాయి. ఈ నగరాల్లోని మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్‌లో 58 శాతం 5జీ ద్వారానే జరుగుతోంది. అయితే, క్రమంగా చిన్న పట్టణాలకు, ఇతర సర్కిళ్లకు కూడా 5జీ వేగంగా విస్తరిస్తోందని, ఇది కేవలం పట్టణాలకే పరిమితం కాలేదని నివేదిక పేర్కొంది.ఈ మార్పులో దేశంలోని స్మార్ట్‌ఫోన్ల లభ్యత కూడా కీలక పాత్ర పోషిస్తోంది. 2025 నాటికి దేశంలో 89.2 కోట్ల 4జీ డివైజ్‌లు యాక్టివ్‌గా ఉండగా, వాటిలో 38.3 కోట్లకు పైగా ఫోన్లు 5జీకి సపోర్ట్ చేసేవే. అంతేకాకుండా, గతేడాది మార్కెట్లోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్లలో 90 శాతానికి పైగా 5జీకి మద్దతిచ్చేవి కావడంతో వినియోగదారులు సులభంగా కొత్త టెక్నాలజీకి మారుతున్నారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడకం పెరిగేకొద్దీ నెట్‌వర్క్‌లపై మరింత భారం పడుతుందని, అందుకు అనుగుణంగా టెలికాం నెట్‌వర్క్‌లు సిద్ధం కావాల్సి ఉంటుందని నోకియా అంచనా వేసింది. 2031 నాటికి భారతదేశంలో 5జీ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 100 కోట్లు దాటవచ్చని నివేదిక అంచనా వేసింది.

# టెక్ దిగ్గజం ఒరాకిల్‌లో భారీ లేఆఫ్‌లు

**ఈ-మెయిల్‌తో ఉద్యోగాలకు మంగళం!**




ప్రముఖ క్లౌడ్ టెక్నాలజీ సంస్థ ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే ప్రక్రియను ప్రారంభించింది. మంగళవారం ఉదయాన్నే అనేకమంది ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపి, వారి ఉద్యోగాలను రద్దు చేస్తున్నట్లు తెలియజేసింది. ఈ పరిణామం టెక్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.అమెరికాలో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటల నుంచే ఉద్యోగులకు ఈ-మెయిల్స్ రావడం మొదలైంది. "సంస్థ ప్రస్తుత వ్యాపార అవసరాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, సంస్థాగత మార్పులలో భాగంగా మీ పాత్రను తొలగించాలని నిర్ణయించాం. దీని ఫలితంగా, ఈ రోజే మీకు చివరి పనిదినం" అని ఆ మెయిల్‌లో ఒరాకిల్ స్పష్టంగా పేర్కొంది.త్వరలోనే కంప్యూటర్, ఈ-మెయిల్, ఫైల్స్ యాక్సెస్‌ను నిలిపివేస్తామని, ఆ తర్వాత లాగిన్ కావడం సాధ్యం కాదని కూడా తెలిపింది. కంపెనీకి చెందిన రహస్య సమాచారాన్ని కాపీ చేయడం లేదా డౌన్‌లోడ్ చేయడం నిషేధమని ఉద్యోగులను హెచ్చరించింది.నివేదికల ప్రకారం, ఒరాకిల్ సుమారు 20,000 నుంచి 30,000 మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉంది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో దాదాపు 18 శాతానికి సమానం. టెర్మినేషన్ పత్రాలపై సంతకం చేసిన వారికి సెవరెన్స్ ప్యాకేజీ అందిస్తామని, దీని వివరాలను వ్యక్తిగత ఈ-మెయిల్ ఐడీలకు పంపుతామని కంపెనీ వెల్లడించింది. 2025 మే నాటికి కంపెనీలో దాదాపు 1,62,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

# 2027లో భారత్ జీడీపీ వృద్ధిరేటు మోస్తరు నుంచి 6.5 శాతం : ఐసీఆర్ఏ

**జీడీపీ వృద్ధిరేటుపై ఇంధన సంక్షోభం ఎఫెక్ట్- దేశ వృద్ధిరేటు కొంతమేర తగ్గే అవకాశాలు**

**ద్రవ్యోల్బణం మంటలతో జనజీవితాలు ప్రభావితమయ్యే ముప్పు ఉందన్న ఐసీఆర్ఏ**

భారత్ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 2026 - 2027 ఆర్థిక సంవత్సరంలో మోస్తరు నుంచి 6.5 శాతం మేర ఉండొచ్చని ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ (ఐసీఆర్ఏ - ×జ=ూ) అంచనా వేసింది. పశ్చిమాసియా యుద్ధం కొనసాగుతుండటం, ఇంధన సంక్షోభం తీవ్రత కారణంగా ప్రస్తుత (2025 - 2026) ఆర్థిక సంవత్సరంలో 7.6 శాతంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొంతమేర తగ్గొచ్చని తెలిపింది. భారతదేశ కరెంట్ ఖాతా లోటు సైతం ప్రస్తుతమున్న 1 శాతం నుంచి 1.7 శాతానికి పెరగొచ్చని ఐసీఆర్ఏ పేర్కొంది. 2027 మార్చి 31న ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో 1 బ్యారెల్ ముడి చమురు ధర సగటున 85 డాలర్లు ఉంటుందనే ప్రాతిపదికన జీడీపీ అంచనాలను రూపొందించామని చెప్పింది.

### ప్రతికూల అంశాలు - సానుకూల అంశాలు

2026 - 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ జీడీపీ వృద్ధిరేటును చాలా అంశాలు ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నాయని ఐసీఆర్ఏ తెలిపింది. ఇంధన ధరల పెరుగుదల, ఇంధన వనరుల లభ్యతపై ఆందోళనలు, భారత్‌పై అమెరికా విధించే సుంకాల విషయంలో చోటుచేసుకునే పరిణామాలు ప్రతికూలంగా పరిణమించొచ్చని పేర్కొంది. ఇక జీఎస్టీ రేట్ల తగ్గింపు, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపులు, ఆహార ద్రవ్యోల్బణంలో తగ్గుదల, వినియోగానికి ఊతమిచ్చే వ్యవసాయ రంగంలోని ఆశాజనక పరిణామాలు సానుకూలంగా ఉంటాయని విశ్లేషించింది. పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధన వనరుల సప్లైలకు అంతరాయం కలుగుతున్నందున భారత్‌లో ద్రవ్యోల్బణం మరింత పెరగొచ్చని ఐసీఆర్ఏ నివేదిక అంచనా వేసింది. ఇంధన ధరల పెరుగుదల కారణంగా నిత్యావసరాల ధరలు పెరుగుతాయని చెప్పింది. దీనివల్ల సమీప కాలంలో వినియోగదారులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటారని తెలిపింది.




### జనవరి - ఫిబ్రవరి దాకా ఓకే

"వాస్తవానికి 2026 జనవరి - ఫిబ్రవరి మధ్యకాలంలో భారత ఆర్థిక వ్యవస్థ చక్కటి పనితీరును కనబర్చింది. అన్ని విభాగాల్లోనూ మంచి ఆర్థిక గణాంకాలను సాధించింది. దీంతో సమీప కాలంలోనూ అదే ట్రెండ్ కొనసాగుతుందనే ఆశాభావం వ్యక్తమైంది. కానీ ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచే భారత్‌కు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ యుద్ధం ఇంకా కొనసాగుతుండటంతో జీడీపీ వృద్ధిరేటు అంచనాలను తగ్గించాల్సి వస్తోంది. ఎందుకంటే ముడి చమురు, సహజ వాయువు, ఎల్‌పీజీ, యూరియా కోసం పశ్చిమాసియా దేశాలపైనే భారత్ ఎక్కువగా ఆధారపడుతోంది. ప్రస్తుతానికి ఆయా అరబ్ దేశాల నుంచి భారత్‌కు సప్లైలు జరిగే పరిస్థితులు లేవు. ఇదే పరిస్థితి ఇంకొంత కాలం కొనసాగినా, భారతదేశంలోని చాలా రంగాలు ప్రతికూలంగా ప్రభావితం అవుతాయి. చాలా వస్తువుల ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి. కంపెనీలు, తయారీ సంస్థల లాభదాయకత తగ్గుతుంది" అని ఐసీఆర్ఏ విశ్లేషించింది.

### ద్రవ్య లభ్యతను పెంచడానికే ఆర్‌బీఐ మొగ్గుచూపొచ్చు

"2026-2027 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో వినియోగదారు ధరల సూచీ (ఙూ×) ద్రవ్యోల్బణం మరింత పెరిగే ముప్పే ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వానికి చెందిన మానిటరీ పాలసీ కమిటీ (వీూజ) ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం రెపో రేట్, బ్యాంక్ రేట్, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేట్, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేట్‌ల పెంపును నిలువరించే నిర్ణయాన్ని కొనసాగించే అవకాశం ఉంది. దీనివల్ల దేశంలో వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుంది. దేశంలో ద్రవ్య లభ్యతను పెంచేందుకు ఇకపైనా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మొగ్గుచూపే సూచనలు ఉన్నాయి. ద్రవ్య లభ్యతను పెంచడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు మందగించకుండా ఆర్‌బీఐ చర్యలు చేపట్టే అవకాశాలు ఉంటాయి" అని ఐసీఆర్ఏ తెలిపింది.



## సల్మాన్ ఖాన్ వంశీ పైడిపల్లి సినిమాలో హీరోయిన్‌గా నయనతార!

ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో మరో భారీ క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా పరిచయం చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దిల్ రాజు నిర్మాణ సంస్థకు ఇది 63వ చిత్రం కావడం విశేషం. ఈ అప్‌డేట్‌ను వెల్లడిస్తూ.. ాఎజ63 ప్రాజెక్ట్‌లోకి ది క్వీన్ అడుగుపెట్టింది.. ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లోకి నయనతారను ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చిత్ర బృందం రాసుకోచ్చింది. నయనతార ఇప్పటికే షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి రికార్డు స్థాయి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు మరోసారి బాలీవుడ్ అగ్ర హీరో అయిన సల్మాన్ ఖాన్‌తో ఆమె జతకట్టడం భారతీయ సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ముగ్గురు దిగ్గజాలైన సల్మాన్ ఖాన్, నయనతార మరియు వంశీ పైడిపల్లి కలయికలో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. దర్శకుడు వంశీ పైడిపల్లి గతంలో దళపతి విజయ్ సరసన 'వారసుడు' (వారిసు) సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్‌ను ఆయన ఎలాంటి సరికొత్త కథతో చూపించబోతున్నారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలోనే అధికారికంగా వెల్లడించనుంది.




## నేను ఈ క్యారెక్టర్ చేయగలనని నమ్మిన ప్రతీ ఒక్కరికి థాంక్యూ

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా వస్తున్న లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైన్ మూవీ 'చెన్నై లవ్ స్టోరీ'. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు.రవి నంబూరి దర్శకత్వం వహిస్తుండగా.. మెలొడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం..తాజాగా 'గుర్తుందా' సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో పాల్గొన్న హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ తన పాత్రపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'గ్లింప్స్ రిలీజైనప్పటి నుంచి చెన్నై లవ్ స్టోరీ మూవీ మీద చాలా అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ సినిమాలో కిరణ్‌తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఆయన ఈ చిత్రం తర్వాత మరింత గొప్ప ఇమేజ్ తెచ్చుకుంటారు. అలాగే ఈ మూవీలో ఇంత బరువైన, ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ నేను చేయగలను అని నమ్మిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నా. మణిశర్మ సంగీతంలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా' అని చెప్పుకొచ్చింది.

## నా డ్రీమ్ అదే.. రాకాస ఈవెంట్‌లో నిహారిక



మెగా డాటర్ నిహారిక నటిగా రాణిస్తూనే నిర్మాతగా కూడా దూసుకెళ్తున్నారు. కమిటీ కుర్రోళ్లు మూవీ తర్వాత నిర్మాతగా బిజీ అయిపోయారు. ప్రస్తుతం తన సొంతం బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై రాకాస అనే మూవీని నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా వస్తోన్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఏప్రిల్ 03న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన నిహారిక నిర్మాతగా తన అనుభవాలను పంచుకుంది. ఇలాంటి సినిమా తీస్తున్నామనగానే చాలామంది సలహాలు ఇచ్చారని తెలిపింది. వీఎఫ్ఎక్స్ విషయంలో పెద్ద పెద్ద సినిమాలే కష్టపడాల్సి వస్తోంది.. మీది చిన్న బడ్జెట్ సినిమా.. చాలా ఇబ్బంది పెడతారు చూసుకోండని నాతో చెప్పారని గుర్తు చేసుకుంది. ఏం చేసినా మాటలు అనే వాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటానని తెలిపింది. ఓ మంచి సినిమా తీశాం.. జనాల్లోకి తీసుకెళ్లడానికి బాగా ప్రమోట్ చేస్తున్నామని నిహారిక వెల్లడించింది. ఇంటింటికి వెళ్లి సినిమా చూపించడానికి కూడా రెడీగా ఉన్నామని నిహారిక పేర్కొంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో భాగమైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు, కారు ఉండాలని ఆశిస్తున్నట్లు నిహారిక తన డ్రీమ్‌ను బయటపెట్టింది. కమిటీ కుర్రోళ్లు మూవీతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశానని నిహారిక తెలిపింది.



## ఫాంటసీ థ్రిల్లర్‌లో స్వీటీ.. ట్రైలర్ చూశారా?

బాహుబలి సినిమాలతో పాన్ ఇండియా క్రేజ్ సొంతం చేసుకున్న అనుష్క శెట్టి.. బరువు సమస్యల కారణంగా తర్వాత మూవీస్ చేయడం చాలా తగ్గించేసింది. అప్పుడో ఇప్పుడో అన్నట్లు చేస్తూ వస్తోంది. 2023లో 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో హిట్ అందుకున్న ఈ హీరోయిన్.. గతేడాది 'ఘాటీ'తో ఘోరమైన డిజాస్టర్ చవిచూసింది. ఇప్పుడు 'కథనార్' అనే మలయాళ చిత్రంతో వచ్చేందుకు సిద్ధమైంది. ఫాంటసీ థ్రిల్లర్ స్టోరీతో తీసిన ఈ సినిమాని తెలుగు, తమిళంలోనూ రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో అనుష్కకి రెండు మూడు షాట్స్‌కి మాత్రమే పరిమితం చేశారు. విజువల్స్ బాగున్నాయి గానీ కాన్సెప్ట్ అర్థమై అర్థం కానట్లు అనిపించింది. డబ్బింగ్‌లో ఉపయోగించిన తెలుగు పదాలు కూడా సగటు ప్రేక్షకుడికి అర్థం కాని విధంగా ఉన్నాయి. జయసూర్య హీరోగా నటించిన ఈ చిత్రంలో అనుష్క శెట్టి హీరోయిన్. ప్రభుదేవా, శాండీ మాస్టర్, వినీత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ ఏడాది జూలై ఆగస్టులో థియేటర్లలోకి మూవీ రానుందని తెలుస్తోంది. రోజిన్ థామస్ దర్శకుడు. అనుష్కకి ఇది 50వ మూవీ కావడం విశేషం.

## ఆదర్శ కుటుంబంలో అదే మెయిన్ హైలైట్..




విక్టరీ వెంకటేశ్, డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ చిత్రం 'ఆదర్శకుటుంబం'. చాలా కాలం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నాయి.అనౌన్స్‌మెంట్ నుంచే ఈ చిత్రంపై సూపర్ బజ్ క్రియేట్ కాగా.. సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ మేరకు సైలెంట్‌గా షూటింగ్ కూడా కానిచ్చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ మేరకు "ఆదర్శకుటుంబం'లో ప్రీ-క్లైమాక్స్‌లో వచ్చే స్పెషల్ కామెడీ ఎపిసోడ్ ప్రధాన హైలైట్‌గా నిలవనుందని సమాచారం. వెంకీ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ పంచ్ డైలాగ్స్ కలిసి మళ్లీ నవ్వుల పండుగ తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక త్రివిక్రమ్ మార్క్ రైటింగ్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఈ సినిమాకు బలం కానున్నాయి. సమ్మర్ రిలీజ్ టార్గెట్ చేస్తూ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు' అంటూ ఓ పోస్ట్ వైరల్ కాగా.. వెయిటింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.


The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.